RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake Printing of Daily News Papers



హైదరాబాద్ | 01 నవంబర్ 2025 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:128

# రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే

**హనుమకొండ ప్రజాబలం ప్రతినిధి**వరదలతో దెబ్బతిన్న ప్రాంతాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ పరిశీలన అనంతరం, హనుమకొండ చేరుకున్న ముఖ్యమంత్రి పట్టణంలోని సమ్మయ్య నగర్, కాపువాడ, పోతననగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు.

వరదల వల్ల తీవ్రంగా దెబ్బతిన్న ఆ ప్రాంతాలను పరిశీలిస్తూ బాధితులతో మాట్లాడారు. అవసరమైన సహాయక చర్యలు తీసుకుని, అన్ని రకాలుగా ఆదుకుంటామని బాధితులకు భరోసానిచ్చారు. దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, నాలాలను పరిశీలించి, మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. తక్షణం పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశాలిచ్చారు.

ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన పనులు, తక్షణం తీసుకోవలసిన చర్యలపై ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు.

భారీ వర్షాల వల్ల 16 జిల్లాల్లో జరిగిన నష్టంపై జిల్లాల వారిగా సమగ్రమైన నివేదికలు తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. భారీ వర్షాలు, వరదల వల్ల 12 జిల్లాల్లో తీవ్రంగా నష్టం వాటిల్లిందని, పంట నష్టానికి పరిహారం చెల్లించాల్సి ఉన్నందున అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వారం రోజుల్లో సమగ్రమైన నివేదికలు అందించాలని స్పష్టం చేశారు.

భారీ వర్షాల వల్ల నష్టపోయిన ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం తదితర ప్రాంతాల మీదుగా ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే చేశారు. అనంతరం హనుమకొండ చేరుకున్న ముఖ్యమంత్రి జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితులతో మాట్లాడారు. వరద నష్టంపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు.

అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి , కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్ , ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి బాధిత కుటుంబాలను ఆదుకునే విషయంలో స్పష్టమైన సూచనలు ఇచ్చారు.

“వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం జరిగింది. నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు 10 వేల రూపాయల చొప్పున పరిహారం అందించాలని అనుకుంటున్నాం. క్షేత్రస్థాయిల్లో పంట నష్టం వివరాలను నమోదు చేస్తూ నివేదికలివ్వాలి. వరదల వల్ల ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి 5 లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని ప్రభుత్వం ఇదివరకే ఉత్తర్వులు జారీ చేసింది. విధానపరమైన లోటుపాట్లు లేకుండా వెంటనే వివరాలను నమోదు చేయాలి.

ఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా పొలాల్లో ఇసుక మేట తొలగించాలి. దానికి అంచనాలు రూపొందించండి. వరదల వల్ల నష్టపోయిన వారికి ఎంత చేసినా వారి నష్టం పూడ్చలేనిది. ఇండ్లు నష్టపోయిన వారికి 15 వేల చొప్పున పరిహారం అందించాలి. అత్యంత నిరుపేదలు ఉంటే వారి అర్హత మేరకు అదనంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలి. వరదల వల్ల నిరాశ్రయులైన వారి జాబితాలను తయారు చేయండి.

భారీ వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో దాదాపు అన్ని చోట్లా దాదాపుగా ఇదే రకంగా నష్టం వాటిల్లింది. క్షేత్రస్థాయిలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పంట నష్టం, పశు నష్టంతో పాటు ఇండ్లు, రోడ్లు, కల్వర్టుల వంటి మౌలిక సదుపాయాలు దెబ్బతిన్న ప్రాంతాలకు సంబంధించి సమగ్రమైన నివేదికలు తయారు చేయాలి. ప్రజాప్రతినిధులు సైతం కిందిస్థాయిలో జరిగిన నష్టంపై కలెక్టర్లకు నివేదికలు సమర్పించాలి.







మిగతా 2లో

**వరదలతో దెబ్బతిన్న ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో పరిశీలన**

**సమ్మయ్యనగర్ ,కాపువాడ, పోతననగర్ లో పర్యటన**

**హనుమకొండ,వరంగల్ కలెక్టర్లతో అధికారులతో సమీక్ష**

**తాత్కాలిక పరిష్కారం కాకుండా శాశ్వతపరిష్కార దిశగా ప్రణాళికలు రూపొందించండి**

**నాలాల కబ్జాలను తొలగించాల్సిందే .. ఎంతటి వారైన ఉపేక్షించేది లేదు .. సీఎం**





**సుదర్శన్ రెడ్డి, ప్రేమ్ సాగర్ రావ్ లకు శుభాకాంక్షలు..**

**మహేష్ కుమార్ గౌడ్, టీపీసీసీ అధ్యక్షులు..**

వార్త 2 లో

## తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నియామకం



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31 :** తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నియామకం ఉత్తర్వులు జారీచేశారు. శుక్రవారం జనరల్ అడ్మినిస్ట్రేషన్ (జనరల్,ఎల్ అండ్ సి) విభాగం ప్రభుత్వం కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,ఎమ్మెల్యేను తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా కేబినెట్ మంత్రి హోదాతో అక్టోబర్ 31 నియమిస్తోంది,
వినియోగదారుల వ్యవహారాలు,ఆహార%ం%పౌర సరఫరాల శాఖ తదనుగుణంగా అవసరమైన తదుపరి చర్యలుతీసుకుంటుంది.
ఆదేశం ద్వారా మరియు తెలంగాణ గవర్నర్ పేరుతో,కె రామకృష్ణ రావు ప్రభుత్వానికి ప్రధాన కార్యదర్శి కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,ఎమ్మెల్యే
ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి,సిఎపి %ం% సిఎస్ విభాగం.మంత్రుల అందరికీ. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పి.ఎస్.సి.ఎం.కి ప్రిన్సిపల్ సెక్రటరీకి,పి.ఎస్.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పి.ఎస్.(పోల్.),జి.ఎ.డి.కి పి.ఎస్.పే %ం% అకౌంట్స్ ఆఫీసర్, తెలంగాణ,హైదరాబాద్.అకౌంటెంట్ జనరల్, తెలంగాణ,హైదరాబాద్.ఆదేశం ద్వారా ఫార్వార్డ్ చేయబడింది.

**ప్రెస్ క్లబ్ ఫ్యామిలీ క్లబ్‌గా మార్చి తీరుతాం: నూతన కార్యవర్గం హామీ**



# హైదరాబాద్ ప్రెస్‌క్లబ్

## నూతన పాలక మండలి బాధ్యతల స్వీకరణ




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్, అక్టోబర్ 31:హైదరాబాద్ ప్రెస్ క్లబ్ 2025-2027 నూతన కార్యవర్గం నిరాడంబరంగా బాధ్యతలు చేపట్టింది.

గత ఆదివారం జరిగిన ఎన్నికలలో ఫ్రెండ్స్ ప్యానల్ ఘన విజయం సాధించింది. శుక్రవారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ ఆవరణలో నూతనంగా ఎన్నికైన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్. విజయ్ కుమార్ రెడ్డి, రమేష్ వరకుప్పల,ఉపాధ్యక్షులుగా అరుణ అత్తలూరి, పి .రాజేష్, జాయింట్ సెక్రటరీలుగా చిలుకూరి హరి ప్రసాద్, బాబురావు, ట్రెజరర్ గా రమేష్ వైల్ల బాధ్యతలు చేపట్టారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్ .ఉమాదేవి, మర్యాద రమాదేవి, కళ్యాణం రాజేశ్వరి ,శంకర్, కస్తూరి శ్రీనివాస్, నాగరాజు శ్రీనివాస్ రెడ్డి, రచన, అశోక్ దయ్యాల, సత్యనారాయణ అలియాస్ సత్తిబాబు, అమిత్ బాధ్యతలు స్వీకరించారు. ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ సీనియర్ పాత్రికేయులు దేవులపల్లి అమర్ సమక్షంలో పాత పాలకమండలి మినిట్స్ బుక్ ను నూతన కార్యవర్గానికి అందజేసింది. ఎన్నికలకు రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి సహాయ కార్యదర్శి కొండ శ్రీనివాసులు నూతనంగా ఎన్నికైన పాలకమండలి సభ్యులకు ఎన్నికైనసర్టిఫికెట్లను ప్రధానం చేశారు.తెలుగు రాష్ట్రాలలో ప్రతిష్టాత్మక క్లబ్ గా పేరున్న హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ను మరింత అభివృద్ధి చేయడంతో పాటు క్లబ్ సభ్యుల సంక్షేమం కోసం పని చేయాలని నూతన పాలకమండలికి సీనియర్ పాత్రికేయులు సూచించారు. తమపై ఎంత విశ్వాసంతో ఓటు వేసి గెలిపించిన సభ్యుల నమ్మకాన్ని వొమ్ము చేయకుండా పనిచేస్తామని నూతన పాలకమండలి ప్రకటించింది. ఎన్నికల వరకే వేరువేరు ప్యానల్స్ అని ఎన్నికలు ఎన్నికలు ముగిశాక పోటీ చేసిన వారందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని నూతన పాలకమండలి తెలిపింది. ప్రెస్ క్లబ్ పూర్వ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్. వేణుగోపాల్ నాయుడు ఆర్ రవికాంత్ రెడ్డిలు తమ బాధ్యతలను కొత్త కమిటీకి అప్పగించారు. ఆరు దశాబ్దాల చరిత్ర గల ప్రెస్ క్లబ్ ను ఫ్యామిలీ క్లబ్ గా మార్చడంతో పాటు సభ్యులకు ఇచ్చిన హామీలన్నింటిని నిలుపుకుంటామని నూతన పాలకమండలి ఈ సందర్భంగా హామీ ఇచ్చింది. నవంబర్ లో ఫ్యామిలీ గెట్ టుగెదర్ నిర్వహించడంతోపాటు వివిధ నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని పాలకమండలి ఈ సందర్భంగా వెల్లడించింది. ఈ కార్యక్రమంలో టి యు డబ్ల్యు జే రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ , రాష్ట్రబీసీ బిసి కమిషన్ సభ్యులు సురేందర్, జనం సాక్షి అధినేత రెహమాన్, సీనియర్ పాత్రికేయులు, సీజీకే మూర్తి సహా పలువురు సీనియర్ జర్నలిస్టులు బి కిరణ్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.


# ప్రజాబలం

01 నవంబర్ 2025 శనివారం


## సిక్స్టీ సెవన్ ఇయర్ గురించి తెలుసా

67 (సిక్స్-సెవెన్) 2025 సంవత్సరపు 'వర్డ్ ఆఫ్ ది ఇయర్' గా ఎందుకు ఎంపికైంది? ఎందుకో తెలుసా..? అనుకోని విధంగా, డిక్షనరీ.కామ్ '67' (అవును, కేవలం ఒక సంఖ్య)ను 2025 సంవత్సరపు పదంగా ప్రకటించింది. ఈ విచిత్రమైన ఎంపిక కేవలం ఒక అంకె కంటే ఎక్కువే. ఇది జెన్ జి ఇంటర్నెట్ సంస్కృతికి ఒక చిహ్నం, మీమ్-ఆధారిత స్లాంగ్‌కు అసంబద్ధమైన హాస్యం డిజిటల్ వ్యక్తీకరణలో ఎలా ఆధిపత్యం చెలాయిస్తుందో తెలిపే భాషా సంకేతం. ఎలా పలుకుతారు..? ఈ పదాన్ని "సిక్స్-సెవెన్" అని పలుకుతారు ? ఎప్పుడూ "సిక్స్టీ-సెవెన్" అని కాదు ? మరియు దీనికి ఒకే ఒక స్పష్టమైన అర్థం లేదు. అయినప్పటికీ, సోషల్ ప్లాట్‌ఫారమ్‌లు మరియు గేమింగ్ ప్రపంచంలో దీని వైరల్ వ్యాప్తి కారణంగా, ఇది ఒక భావోద్వేగానికి, ఒక ××'వైబ్'××కు లేదా ఒక పంచ్‌లైన్‌కు సంక్షిప్త రూపంగా మారింది. '67' ఎందుకు ఎంపికైంది? మూలాలు మరియు పాప్ కల్చర్ సంబంధాలు:. స్క్రిల్లా యొక్క 2024 ట్రాక్ "డూట్ డూట్ (6 7)" తో దీనికి సంబంధం ఉండవచ్చు. ఎన్‌బీఏ స్టార్ లామెలో బాల్ 6 అడుగుల 7 అంగుళాల పొడవు ఉండటం దీనికి మరొక కారణంగా భావిస్తున్నారు. యువతకు సంబంధించిన బాస్కెట్‌బాల్ వీడియో ఆన్‌లైన్‌లో వైరల్ అయిన తర్వాత, "ది 67 కిడ్" అని పిలువబడే ఒక వైరల్ వ్యక్తి దీనిని ప్రాచుర్యంలోకి తెచ్చాడు. యువతల వినియోగం. యువకులు మరియు పిల్లలు సాధారణ సంభాషణలలో '67' ను జోడించడం ప్రారంభించారు.ఈ ఏడాది వర్డ్ ఆఫ్ ది ఇయర్.. 67. ఆశ్చర్యపోతున్నారా.. అవును ఈ నంబరే ఈ 2025 వర్డ్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచింది. అయితే టీనేజర్లు ఎక్కువగా ఈ పదాన్ని ఉపయోగిస్తున్నారట. టీచర్లు కూడా టీనేజీ యువత దీన్ని వాడకుండా ఉండాలంటే ఏం చేయాలని అని టిప్స్ అడుగుతుండటం గమనార్హం. అయితే ఈ పదంపై పెద్దలు మాత్రం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అర్థం లేని పదాలు ఉపయోగిస్తూ భాషను నాశనం చేస్తున్నారని అంటున్నారు. అయితే అమెరికా ర్యాపర్ స్క్రిల్లా పాట నుంచి ఈ పదం పుట్టిందని చెబుతున్నా.. దీనికి సరైన అర్థం మాత్రం చెప్పలేకపోతున్నారు.ప్రతి సంవత్సరం డిక్షనరీ.కామ్ ప్రకటించే వర్డ్ ఆఫ్ ది ఇయర్ జాబితాలో ఈసారి ఒక సంఖ్యకి చోటు దక్కింది. అదే "67". అవును, మీరు సరిగ్గానే చదివారు. ఒక సంఖ్యే ఈసారి వర్డ్ ఆఫ్ ది ఇయర్ పదంగా ఎంపికైంది.సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో ముఖ్యంగా టిక్ టాక్, మీమ్స్ లో "67" అనే పదం 2024 చివరి నాటికి ఒక స్లాంగ్‌గా విస్తృతంగా ప్రాచుర్యం పొందింది. జెన్ ఆల్ఫా అనే కొత్త తరానికి ఇది ఓ మంత్రంలా మారింది. ముఖ్యంగా పాఠశాలల్లో, చాట్‌లలో, వీడియోల్లో ఎక్కడ చూసినా "67" అనేది వినిపించేది. ఈ స్లాంగ్ మొదటగా స్క్రిల్లా అనే సంగీత కళాకారుడు రూపొందించిన అనే పాట నుంచి పుట్టుకొచ్చిందని చెబుతున్నారు. ఆ పాట తర్వాత బాస్కెట్‌బాల్ మీమ్స్, ది 67 కిడ్ పేరుతో వైరల్ అయిన పిల్లవాడు వంటి అనేక సన్నివేశాలు ఈ పదాన్ని గ్లోబల్ ట్రెండ్‌గా మార్చాయి.మిలీనియల్స్, జనరేషన్ జడ్ యువత.. టీనేజీలో ఉన్న సమయంలో.. కామిక్స్ బుక్స్, కొన్ని కార్టూన్ షోల ట్రెండ్ నడిచేది. కానీ జనరేషన్ ఆల్ఫాకి వచ్చేసరికి పూర్తిగా మారిపోయింది. అసలు ట్రెండ్ ఎందుకు నడుస్తుందో.. దానర్థం ఏంటో కూడా చాలా మందికి తెలియట్లేదు. తాజాగా టీనేజర్లు ఎక్కువగా ఏ పదం వాడుతున్నారో తెలిసిపోయింది. ఈ మేరకు ప్రముఖ ఆన్‌లైన్ డిక్షనరీ వెబ్‌సైట్ 'డిక్షనరీ.కామ్'.. 67 నంబర్‌ను 2025కి వర్డ్ ఆఫ్ ది ఇయర్‌గా ప్రకటించింది. ఈ నంబర్ టీనేజీ యువకులకు.. టీనేజ్‌లోకి అడుగుపెట్టబోతున్న నోళ్లలో తెగనానుతోందట.అయితే దీనిపై మాత్రం పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారట.30 ఏళ్లు పైబడిన జనరేషన్ వై, జెన్‌జీ.. అసలు దీని అర్థం ఏమిటని ఆశ్చర్యపోతున్నారు. 67 నంబర్‌ను డిక్షనరీలో చేర్చడం ఏంటని మరికొందరు ప్రశ్నిస్తున్నారు. ఈ కాలం పిల్లలు ఇంటర్నెట్‌లో వేసే జోకులు.. ఇంగ్లీష్ భాషనే నాశనం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తుండటం గమనార్హం. ఇక్కడ ఇంకో ట్విస్ట్, 67ను.. కలిపి చదవకూడదట. 'సిక్స్‌సెవెన్' అని చదవాలట. వింతగా అనిపిస్తోంది కదూ!జెనరేషన్ ఆల్ఫా అంటే 2010 నుంచి 2025 మధ్య జన్మించినవారు. ఈ జెన్ ఆల్ఫా.. 67 పదాన్ని ఎందుకు విపరీతంగా వాడుతున్నారో అర్థంకాక పెద్దలు తలపట్టుకుంటున్నారు. ఎందుకిలా చేస్తున్నారో క్లారిటీ లేదు. అయితే కొందరు మాత్రం దీనికి ఏ అర్థం లేదని.. ఏదో ఊరికే అలా వాడేపదం అని అంటున్నారు. కాగా, దీనిని నిర్వచించడం కష్టమని అని చెప్పిన డిక్షనరీ.కామ్.. ఇది రెండు చేతులతో చేసే సంజ్ఞ అని తెలిపింది. అమెరికా ర్యాపర్ స్క్రిల్లా పాడిన డ్రిల్ సాంగ్ డూట్ డూట్ నుంచి ఆనీనీబి నుంచి ఈ పదం పుట్టినట్లు చెప్పింది.స్క్రిల్లా పాడిన డ్రిల్ పాటలో 67 నంబర్.. హుక్ వర్డ్‌గా వినిపిస్తుంది. బహుశా అప్పటి నుంచే ఈ నంబర్‌ను ఎక్కువగా ఉపయోగిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా, టీనేజీ యువత 67ను విపరీతంగా ఉపయోగిస్తుండటంతో.. దీన్ని ఎలా ఆపాలి అంటూ ఉపాధ్యాయులు నెట్టింట్లో పోస్టులు పెడుతుండటం గమనార్హం. పలువురు స్పందిస్తూ.. టిప్స్ కూడా చెబుతున్నారు.కాగా, 67 నంబర్ మాత్రమే కాకుండా ఆరాఫార్మింగ్, బ్రోలిగార్కీ , ట్రాడ్‌వైఫ్, క్లాంకర్ , జెన్ జీ, కిస్‌కామ్, డైనమైట్ ఎమోజీ, ఓవర్‌టూరిజం వంటి పదాలతో పాటు ట్రంప్ ఆడుతున్న టారిఫ్ గేమ్ లోంచి టారిఫ్ కూడా.. 2025కి వర్డ్ ఆఫ్ ది ఇయర్‌గా పోటీ పడ్డాయి. కానీ 67 నంబర్ ముందు నిలబడలేకపోయాయి. ఈసారి నంబర్.. వచ్చే ఏడాది ఎమోజీలను కూడా వర్డ్ ఆఫ్ ది ఇయర్‌గా ప్రకటిస్తారేమో అని నెటిజన్లు సెటైర్లు పేలుస్తున్నారు.డిక్షనరీ.కామ్ ప్రకార "67" అనేది ఒక అర్థం లేకపోయినా, అందరికీ అర్థమయ్యే పదం అని పేర్కొంది. ఇది సాధారణంగా బనీ-బనీ, ఏదో మధ్యస్థం వంటి భావాన్ని వ్యక్తం చేస్తుంది. అయితే, దీని అసలు అర్థం అస్పష్టతగా ఉంది. "67" అనేది ఒక నిర్దిష్ట అర్థం లేని, సందర్భానుసారం మారే పదంగా మారింది. మొత్తానికి, ఈ "67" అనేది కేవలం ఒక సంఖ్య కాదు.. అది జనరేషన్ ఆల్ఫా తమదైన రీతిలో ప్రపంచాన్ని ఎలా నిర్వచిస్తుందో తెలిపే భాషా ప్రకటన.

## కాంగ్రెస్‌లో భారీగా చేరికలు ఇంటింటి ప్రచారంలో నవీన్ యాదవ్



**జూబ్లీహిల్స్ (ప్రజాబలం ప్రతినిధి ) అక్టోబర్ 31** జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీకి ఊపిరి పోసే విధంగా పెద్ద ఎత్తున చేరికలు కొనసాగుతున్నాయి..ఈ క్రమంలో రహమాత్ నగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ లీడర్ యానమాల రాజు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా యానమాల రాజు మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం కోసం కష్టపడుతున్న నాయకుడు నవీన్ యాదవ్ అభివృద్ధి దృష్టికోణం, ప్రజల పట్ల ఉన్న ఆప్యాయం చూసి తాను కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు తెలిపారు..నవీన్ యాదవ్ యానమాల రాజు ని పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తూ, రానున్న ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పని చేసి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు..ఈ చేరికతో రహమత్ నగర్ డివిజన్ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూరింది..స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచార వేగాన్ని మరింత పెంచుకుంటూ జూబ్లీహిల్స్ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల మధ్య విస్తృతంగా



పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ రహమత్ నగర్ డివిజన్‌లోని NSCB నగర్, ఓం నగర్, బ్రహ్మశంకర్ నగర్ ప్రాంతాల్లో ఈరోజు ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు..ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల సమస్యలను ఆరా తీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో జూబ్లీహిల్స్ అభివృద్ధి వేగం పెరిగిందని.. ప్రస్తుతం 150 కోట్ల రూపాయలు మంజూరు తో కొంతవరకు సీసీ రోడ్లు డ్రైనేజీ పనులు జరిగాయని తెలియజేస్తూ.. ప్రజలతో స్నేహపూర్వకంగా మాట్లాడుతూ నవంబర్ 11న జరిగే ఎన్నికల్లో "చేతి గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించి అభివృద్ధి పంథాను కొనసాగించాలని ప్రజలను కోరారు..ఈ సందర్భంగా ప్రజలు నవీన్ యాదవ్ కి విశేష స్పందన చూపారు. ఆయన అభివృద్ధి పట్ల చూపుతున్న కృషి, అందరికీ అందుబాటులో ఉండే నాయకుడిగా ఉన్న తీరుపై స్థానికులు ప్రశంసలు కురిపించారు..ఈ కార్యక్రమంలో రోడ్ల డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్రెడ్డి రామిరెడ్డి , తెలంగాణ బీసీ మహిళా బోర్డు సభ్యురాలు భాగ్యలక్ష్మి .స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొని ప్రజల్లో ఉత్సాహాన్ని నింపారు..

## సుదర్శన్ రెడ్డి, ప్రేమ్ సాగర్ రావ్ లకు శుభాకాంక్షలు..

## మహేష్ కుమార్ గౌడ్, టీపీసీసీ అధ్యక్షులు..



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** ఇద్దరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మంచి అనుభవం ఉన్న నేతలు..ప్రజల్లో రాజకీయాలలో మంచి పట్టు ఉన్న సీనియర్ నాయకులు సుదర్శన రెడ్డి కి ప్రభుత్వ సలహాదారు గా నియమించడం, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావ్ గారిని అత్యంత కీలకమైన పౌర సరఫరాల కార్పొరేషన్ చైర్మన్ గా నియమించడం హర్షించదగ్గ విషయం.. ప్రభుత్వ నిర్ణయాలను స్వాగతిస్తున్నాము..ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుపై సలహాదారుగా సుదర్శన్ రెడ్డి ని నియమించడం వల్ల రాష్ట్రంలో పథకాల అమలు మరింత వేగంగా జరిగే అవకాశాలు ఉంటాయి.

ఆయన అనుభవం, చిత్తశుద్ధి రాష్ట్ర అభివృద్ధి కి మరింత తోడ్పడుతుంది..

అలాగే ప్రేమ్ సాగర్ రావ్ గారిని పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ చైర్మన్ గా అవకాశం ఇవ్వడం వల్ల ప్రభుత్వం అమలు చేస్తున్న రేషన్ కార్డులు, సన్న బియ్యం పథకాలు, ధాన్యం కొనుగోలు లాంటి కీలకమైన పనులు మరింత వేగంగా జరుగుతాయి.

వీరిద్దరూ మంచి నాయకులకు అవకాశాలు కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారికి మంత్రులకు కాంగ్రెస్ అధిష్టానానికి ధన్యవాదాలు..

మహేష్ కుమార్ గౌడ్ టీపీసీసీ అధ్యక్షులు..

## సమాచార శాఖ డిడి ప్రసాద రావు పదవీ విరమణ



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్, అక్టోబర్ 31: సమాచార పౌర సంబంధాల శాఖలో డిప్యూటీ డైరెక్టర్ గా ఉన్న జి ప్రసాదరావు నేడు పదవీ విరమణ చేశారు వివిధ హోదాల్లో దాదాపు 41 సంవత్సరాల సర్వీసు అనంతరం నేడు ప్రసాదరావు పదవి విరమణ కార్యక్రమాన్ని సమాచార భవన్ లో ఘనంగా నిర్వహించారు. ఖమ్మం వరంగల్ ఆదిలాబాద్ హైదరాబాద్ జిల్లాల్లో వివిధ హోదాల్లో పని చేసిన ప్రసాదా రావు సేవలను ఈ పదవీ విరమణ కార్యక్రమానికి హాజరైన సీనియర్ అధికారులు కొనియాడారు. ఈ పదవి విరమణ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్లు డీ.ఎస్ జగన్, డి శ్రీనివాస్, కే వెంకటరమణ డిప్యూటీ డైరెక్టర్లు హాష్మి,, వై వెంకటేశ్వర్లు సురేష్, ఆర్.ఐ.ఈ జయరాం మూర్తి, తెలంగాణ మాసపత్రిక ఎడిటర్ శాస్త్రి లతోపాటు సమాచార శాఖ అధికారులు, సిబ్బంది, డిడి ప్రసాద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు,

## రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే



నష్టం అంచనాలను తయారు చేయడంలో విపత్తు నిర్వహణ విభాగం ఒక ఫార్మేట్‌ను తయారు చేసి అన్ని జిల్లాల నుంచి నివేదికలు తెప్పించాలి. ఇలాంటి విపత్తు సమయాల్లో రాష్ట్ర ప్రభుత్వం అందించే సహాయంతో పాటు కేంద్రం నుంచి కూడా నిధులను రాబట్టుకోవలసిన అవసరం ఉంది. ఇందులో ఏమాత్రం అలసత్వం వద్దు.

ఇలాంటి సమయాల్లో కేవలం తాత్కాలిక పరిష్కారం వైపు కాకుండా శాశ్వత పరిష్కారాలకు కృషి చేయాలి. వరదల విషయంలో అడ్డంకులను తొలగించకపోవడం కూడా నష్టం ఎక్కువగా జరగడానికి ఆస్కారమించింది. నీటి వనరుల ఇన్‌ఫ్లోస్, అవుట్‌ఫ్లోస్ విషయాల్లో నీటి పారుదల శాఖ అంచనాలను పరిగణలోకి తీసుకోవాలి. లేదంటే వర్షాలొచ్చినప్పుడు మళ్లీ ఇదే సమస్యలు వస్తాయి. అలాంటివి రానివ్వకండి.

శాఖల మధ్య సమన్వయం ఉండాలి. ముఖ్యంగా రోడ్లు భవనాలు, నీటి పారుదల, మున్సిపల్, వైద్య ఆరోగ్య, విద్యుత్ తదితర శాఖల మధ్యన సమన్వయం ఉండాలి. ఏ విభాగం తర్వాత ఏ విభాగం పనులు పూర్తి చేయాలన్న సమన్వయం ఉండాలి. నాలాలను కబ్జా చేసి అడ్డంకులు సృష్టించే వారి విషయంలో ఎవరినీ వదలొద్దు. కఠినంగా వ్యవహరించాలి. పది మంది కబ్జాలకు పాల్పడితే పది వేల మందికి నష్టం జరుగుతోంది.

ఉమ్మడి వరంగల్ కోర్ అర్బన్ ప్రాంతంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు ఇతర మౌలిక సదుపాయాల విషయంలో ఇంచార్జీ మంత్రి గారు మున్సిపల్, నీటి పారుదల శాఖ అధికారులతో సమన్వయ పరిచి సమగ్రమైన ప్రణాళిక తయారు చేయాలి. కొన్ని చోట్ల స్మార్ట్ సిటీ పనులను వదిలేశారు. పనులను వదిలేయడానికి వీలులేదు. మిగిలిపోయిన పనులను పూర్తి చేయడానికి నివేదికలివ్వండి.

క్లౌడ్ బరస్ట్ ఇక అయిపోయిందన్న నిర్లక్ష్యం వద్దు. గత ఏడాది కూడా ఇలాంటి వర్షాలొచ్చాయి. వాతావరణంలో పెనుమార్పులు సంభవిస్తున్నాయి. ఈ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాల్సిందే.

భారీ వర్షాల వల్ల జరిగిన నష్టం, తీసుకోవలసిన చర్యలపై వారం రోజుల్లోగా కలెక్టర్లు నివేదికలు అందించాలి. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే. నివేదికలను బట్టి వారం రోజుల్లో అన్ని జిల్లాల కలెక్టర్లు నివేదికలు అందించాలి. నివేదికలు అందిన తర్వాత రాష్ట్ర స్థాయిలో అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించి అవసమైన చర్యలు తీసుకుంటాం.

వరద సహాయక కార్యక్రమాల కోసం ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుంది. బాధితులను ఆదుకోవడంలో లేదా క్షేత్రస్థాయిలో నివేదికలు రూపొందించడంలో ఎవరు నిర్లక్ష్యం వహించిన ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుంది." అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ వరదల సమయంలో కొందరు అధికారులు బాగా పనిచేశారని చెబుతూ వారిని ముఖ్యమంత్రి అభినందించారు.

# లోకేష్ పేరును వదలని సైబర్ చీటర్స్



విజయవాడ, అక్టోబరు 31, సైబర్ నేరాల తీరు మారుతోంది. ఇప్పటివరకు సామాన్యులే టార్గెట్ అయ్యేవారు. ఇప్పుడు సెలబ్రిటీలను సైతం వదలడం లేదు. వీఐపీల పేర్లు, ఫోటోలు వాడుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. మొన్న మధ్యన రాయలసీమ జిల్లాకు చెందిన టిడిపి ఎమ్మెల్యే ఒకరిని టార్గెట్ చేసి కోటి రూపాయలకు పైగా వసూలు చేసినట్లు వార్తలు వచ్చాయి. తాజాగా ఏపీ మంత్రి నారా లోకేష్ పేరుతో 57 లక్షల రూపాయలు కొల్లగొట్టేశారు. దీంతో రంగంలోకి దిగిన ఏపీ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఇది సంచలన అంశంగా మారింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.ఏపీకి చెందిన ఓ వ్యాపారికి.. మంత్రి నారా లోకేష్ ప్రొఫైల్ పిక్చర్ గా ఉన్న ఓ వాట్సప్ నుంచి సమాచారం వచ్చింది. కీలకమైన ప్రాజెక్టులకు డబ్బు అవసరం ఉందని చెప్పి.. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా ఫోన్ కాల్ చేసి అచ్చంగా మంత్రిగా మాట్లాడారు. అయితే అది నిజమేనని భావించిన సదరు వ్యాపారి పలు విడతల్లో 57 లక్షల రూపాయల వరకు అలా బెదిరించిన వ్యక్తులకు పంపించాడు. చివరకు ఇది మోసంగా భావించి ఏపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి ప్రధాన నిందితుడు రాజేష్ ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన ఇచ్చిన సమాచారంతో హైదరాబాదులో సాయి శ్రీనాథ్, సుమంత్ అనే ఇద్దరు వ్యక్తులను హైదరాబాదులో అరెస్టు చేశారు. ఈ ఘటన వెనుక పెద్ద ముఠా హస్తం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా ప్రముఖులు, రాజకీయ పార్టీల నేతలను టార్గెట్ చేస్తున్నట్లు స్పష్టం అవుతుంది.కొద్ది రోజుల కిందట ఖమ్మం జిల్లా టిడిపి నేతలను ఇలానే సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేరుతో వాట్సాప్ కాల్ చేశారు. తెలంగాణలో పార్టీ అభివృద్ధికి నిధులు కావాలని.. అందుకు విరాళాలు అందించాలని కోరడంతో కొందరు నేతలు నగదు పంపించారు. అదే సమయంలో తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ ఎన్నికల్లో బీఫారాలు కావాలంటే కొంత మొత్తం చెల్లించాలని కోరడంతో.. రెండోసారి కూడా సదరు నేతలు నగదు జమ చేశారు. అమరావతి వస్తే పార్టీ అధినేత చంద్రబాబుతో బీఫారాలు ఇప్పిస్తామని నమ్మబలికారు. విజయవాడలో వారి పేరుతో హోటళ్లు కూడా బుక్ చేశారు. దీంతో ఇది నిజమని నమ్మిన నేతలు విజయవాడ వెళ్లి హోటల్లో దిగారు. అయితే అక్కడ బిల్లు చెల్లించే క్రమంలో వివాదం జరిగింది. తాము సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డామని గుర్తించిన సదరు నేతలు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనుకడుగు వేశారు. బయటకు చెబితే పరువు పోతుందని భావించారు. ఇంకోవైపు రాయలసీమ జిల్లాకు చెందిన టిడిపి ఎమ్మెల్యే ఒకరు హైదరాబాదులో ఇలానే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డారు. అయితే ఇప్పుడు మంత్రి నారా లోకేష్ పేరు చెప్పి సైబర్ నేరానికి పాల్పడడంతో పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అందుకే కేసును ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

# జగన్ నేతలకు అల్టిమేటం జారీ చేశారా

విజయవాడ, అక్టోబరు 31, వైసీపీ అధినేత జగన్ పార్టీనేతలపై పెద్దగా దృష్టి పెట్టడం లేదనిపిస్తుంది. ఎవరికి వారే నిర్ణయాలు ప్రకటించడం ఇప్పుడు పార్టీలోనే కాదు రాజకీయంగా కూడా చర్చనీయాంశమైంది. ప్రాంతీయ పార్టీ అంటే అధినేత ఆలోచనలను పసిగట్టి నేతలు మసులుకోవాల్సి ఉంటుంది. అయితే కొందరు నేతలు కట్టు తప్పుతున్నారని పార్టీ వర్గాలే అభిప్రాయపడుతున్నాయి. జగన్ ఆలోచనల ప్రకారం నేతలు నడుచుకోవడం లేదనడానికి ఇటీవల జరిగిన అనేక ఘటనలు ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు. జగన్ ఆంధ్రప్రదేశ్ కు దూరంగా ఉండటంతో పాటు నేతలతో తరచూ సమావేశాలు కాకపోవడం వల్లనే ఈ రకమైన ఇబ్బందులు పార్టీలో తలెత్తుతున్నాయన్నది వాస్తవం. అందుకే ఆయన కనిపించరట 2019 ఎన్నికలకు ముందు... 2019 ఎన్నికలకు ముందు.. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ మాట వేదవాక్కుగా నడిచేది. ఏ నిర్ణయమైనా అంతసులువుగా బయటకు చెప్పే వారు కాదు. కేవలం సజ్జల రామకృష్ణారెడ్డి మాత్రమే జగన్ తో మాట్లాడి వచ్చిన తర్వాత పార్టీ, ప్రభుత్వ ఆలోచనను ప్రజల ముందుంచేవారు. ఇక 2019 ఎన్నికల్లో పూర్తిగా జగన్ ఫొటోతోనే గెలిచామన్న భావనలో ఉన్న నేతలు పార్టీ నిర్ణయాలను తప్పుపట్టే సాహసం చేసేవారు కాదు. అందులో నిజం ఉందని చాలా మంది బహిరంగంగా అంగీకరించేందుకు కూడా మొహమాట పడేవారు కాదు. కాని ఎప్పుడైతే జగన్ అధికారానికి దూరమయ్యారో అప్పటి నుంచి అధినేతను కూడా లెక్క చేయని పరిస్థితి నేతల్లో కనిపించడం పార్టీ నాయకత్వంలో ఆందోళన కలిగిస్తుంది. అమరావతి రాజధాని విషయంలోనూ అదే జరిగింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులను జగన్ స్వయంగా అసెంబ్లీలో ప్రకటించారు. గత ఎన్నికల్లో అదే నినాదంతో వెళ్లారు. కానీ ప్రజలు ఆదరించలేదు. అయితే ఓటమి తర్వాత అమరావతిని రాజధానిగానే ఉంచుతామని ఇప్పుడు చెబుతున్నారు. మాజీ మంత్రి జోగి రమేష్ కూడా అమరావతి విషయంలో తమ పార్టీ నిర్ణయం తప్పేనని అంగీకరించడం చర్చ జరుగుతోంది. ఇక విశాఖకు గూగుల్ డేటా సెంటర్ విషయంలోనూ తొందరపడి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కానీ జగన్ మాత్రం గూగుల్ సెంటర్ ఏపీకి రావడం మంచిదేదని చెప్పారు. అలాగే ఇప్పుడు విపత్తుల సమయంలోనూ ఎలాంటి ప్రకటనలు ఎవరూ చేయవద్దని, జగన్ మాత్రమే ప్రకటిస్తారని పార్టీ నాయకత్వం నేతలకు అల్టిమేటం ఇచ్చినట్లు తెలిసింది. మరి నేతలు నాయకత్వం మాటలు విని మౌనంగా ఉంటారా? లేదా? అన్నది చూడాలి.

# అన్న బాటలోనే షర్మిల...




విజయవాడ, అక్టోబరు 31, ఏపీలో రాజకీయాలు చాలా విచిత్రంగా నడుస్తున్నాయి. ఒకవైపు అధికారంలో ఉన్న కూటమి ప్రతిదాన్నీ వీలైనంత ఎక్కువ ప్రచారం చేస్తూ అనుక్షణం ప్రజల నాలుకలపై ఉండడానికి ప్రయత్నిస్తుంటే మరువైపు ప్రతిపక్ష పార్టీల అధినేతలు ఎక్కడో వెనకడుగు వేస్తున్నారు అనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. దానికి తగ్గట్టే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కీలక సమయాల్లో ఏపీలో ఉండటం లేదన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తం అవుతుంటే ఇప్పుడాయన చెల్లెలు, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కూడా అదే బాటలో ఉంటున్నారు. రాజకీయాల్లో ఇది సరైన స్ట్రాటజీ కాదని నిపుణులు అంటున్నారు.2019 ఎన్నికలకు ముందు తాను "అమరావతిలోనే సొంత ఇల్లు కట్టుకున్నానని చంద్రబాబు ఆ సాహసం చేయడం లేదని" పదేపదే చెప్పుకున్న జగన్మోహన్ రెడ్డి 2024లో పార్టీ ఓడిపోయాక వీలైనంత ఎక్కువ సమయం బెంగుళూరులోనే ఉంటున్నారనే అభిప్రాయం సొంత పార్టీ నేతల నుంచే వ్యక్తం అవుతోంది. నేతలు ముఖ్యమైన విషయాలు ఆయనతో చర్చించాల్సిన అవసరం వచ్చినా లేక రాష్ట్రంలో ఏదైనా అవాంతరం వచ్చినా వెంటనే రియాక్ట్ అవ్వాల్సిన సమయాల్లో బెంగళూరులో ఉన్న జగన్మోహన్ రెడ్డి తాడేపల్లికి వచ్చే వరకు వాళ్లు వెయిట్ చేయాల్సి వస్తోంది. నిన్న మొన్నటి తుపాన్ సమయంలో కూడా అయన బెంగళూరులోనే ఉన్నారు. విజయవాడకు రావాల్సి ఉన్నా విమానాలు క్యాన్సిల్ కావడంతో ఆయన రాలేకపోయారు. దీన్ని ఆయన రాజకీయ ప్రత్యర్థులు విమర్శిస్తున్నారు. దీనివల్ల జగన్మోహన్ రెడ్డి ప్రజలకు, పార్టీ నేతలకు అందుబాటులో ఉండటం లేదని అభిప్రాయం ఎక్కువగా ప్రచారం అవుతోంది.

రాజకీయంగా అన్నతో విభేధించి సొంత దారిలో వెళుతున్న షర్మిల నివాసం విషయంలో మాత్రం అన్న బాటలోనే వెళుతోందన్న అభిప్రాయం జనాల్లో ఉంది. నిజానికి ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా ఉన్న ఆమెకు సొంత పార్టీ నుంచే చాలా విమర్శలు వస్తున్నాయి. పార్టీలో అసమ్మతిని సానుకూలం చేసుకోవాల్సిన అవసరం ఆమెకు ఉంది. తుపాను లాంటి విపత్కర పరిస్థితుల్లో అధికారంలో ఉన్నా లేకపోయినా రాజకీయ పార్టీల అధినేతలు ప్రజలకు నేతలకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంది. దానివల్ల క్షేత్రస్థాయిలో పార్టీ నేతలకు ఒక భరోసా ఉండడంతోపాటు సమన్వయంతో పని చేసే అవకాశం ఉంటుంది. కానీ షర్మిల వీలైనంత ఎక్కువగా హైదరాబాదులో ఉండడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. విజయవాడ సమీపంలో ఇల్లు కొన్నారన్న ప్రచారం జరిగినా ఆమె ఇంతవరకు అక్కడకు వెళ్ళింది లేదు. ఆమె కుటుంబ వ్యవహారాల రీత్యా ఎక్కువగా విదేశాల్లో ఉన్న పిల్లల దగ్గరకు వెళుతున్నారు. మరోవైపు వైఎస్ రాజశేఖర్ రెడ్డి వారసుడిగా తన కుమారుడిని ప్రాజెక్ట్ చేసే ప్రయత్నాలూ చేస్తున్నారు. ఇలాంటి కీలక బాధ్యతలు ఎత్తుకున్న షర్మిల తాను ఆంధ్రప్రదేశ్‌లో ఉండాల్సిన అవసరం చాలా ఎక్కువగా ఉంది. కానీ ఎందుకో మరి ఆమె ఇక్కడ నివాసం ఉండడం లేదు. ఇది రాజకీయంగా చాలా రాంగ్ స్ట్రేటజీ అని విశ్లేషకులు చెప్తున్నారు. ఇలాంటి విషయాల్లో కూటమి చాలా వేగంగా దూసుకుపోతోంది. అది తుపాను అయినా వరదైనా ప్రచారంలో మాత్రం ఏ లోటూ రానీయదు. కొన్నిసార్లు ఈ ప్రచారం ఒక హద్దు దాటిందని, అతివృష్టి చేస్తున్నారని ట్రోల్స్ వస్తున్నా అనుక్షణం ప్రజల దృష్టిలో ఉండడానికి కూటమి ప్రయత్నిస్తోంది. ఈ ప్రచారంతో పోటీ పడడం మాట ఎలా ఉన్నా ముందు సొంత పార్టీ నేతలకు అందుబాటులో ఉండడానికి జూ జగన్, షర్మిల లాంటి నేతలు స్థానికంగా ఎక్కువగా ఉండడానికి ప్రాధాన్యత ఇస్తే బాగుంటుందని అనువజ్ఞులు చెబుతున్నారు. కమ్యూనిస్టు నేతలు కూడా ఇప్పటికే వరద ప్రాంతాల్లో పర్యటించి వచ్చిన పరిస్థితుల్లో దివంగత ముఖ్యమంత్రి పిల్లలు, రెండు వేరు వేరు పార్టీలకు అధినేతలు ఇలాంటి విషయాల్లో వెనుక పడడం రాంగ్ స్ట్రాటజీ అనే అభిప్రాయం చాలా మందిలో ఉన్న మాట వాస్తవం. మరి ఇప్పటికైనా జగన్, షర్మిల ఆ దిశగా ఆలోచిస్తారేమో చూడాలి.

# సత్యసాయి శత జయంతి వేడుకలు..

# ప్రభుత్వం నిర్వహిస్తే తప్పేంటి.. హైకోర్టు వార్నింగ్

అనంతపురం, అక్టోబరు 31,పుట్టపర్తి శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను రాష్ట్ర వేడుకగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీన్ని వ్యతిరేకిస్తూ ఏపీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. లౌకిక దేశంలో మతపరమైన వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంపై పటిషనర్ అభ్యంతరం తెలిపారు. అయితే సత్యసాయి ట్రస్ట్ చేసిన ప్రజా సేవలను పరిగణనలోకి తీసుకుని గౌరవించడంలో తప్పేముందని సూటిగా ప్రశ్నించింది. పిటిషన్‌ను వెనక్కి తీసుకోవాలని లేదంటే ఖర్చులు విధిస్తూ.. వ్యాజ్యాన్ని కొట్టివేస్తామని వార్నింగ్ ఇచ్చింది

పుట్టపర్తి శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. నవంబరు 23న జరిగే ఈ వేడుకలకు హాజరు కావాలని.. ఇప్పటికే ప్రధాని మోదీ, తెలుగు రాష్ట్రాలతోపాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు, మంత్రులకు.. శ్రీ సత్యసాయి ట్రస్ట్ సభ్యులు ఆహ్వానాలు అందజేశారు. ఈ మేరకు ప్రధాని మోదీ కూడా హాజరు కానున్నారు. అయితే ఈ ఉత్సవాలను రాష్ట్ర వేడుకగా నిర్వహించడంపై ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన భారత హేతువాద సంఘం అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య అభ్యంతరం వ్యక్తం చేశారు. దీన్ని ఆపాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) దాఖలు చేశారు. ప్రభుత్వ నిధులను ఇలా మతపరమైన కార్యక్రమాలకు మళ్లించడానికి వీలు లేదంటూ ఆ పిటిషన్‌లో అభ్యంతరం తెలిపారు. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన హైకోర్టు పటిషనర్‌కు వార్నింగ్ ఇచ్చింది.సత్యసాయి శతజయంతి ఉత్సవాలను రాష్ట్రప్రభుత్వం అధికారిక వేడుకగా నిర్వహిస్తే తప్పేముందని భారత హేతువాద సంఘాన్ని హైకోర్టు సూటిగా ప్రశ్నించింది. సత్యసాయి ట్రస్ట్ ద్వారా మూడు జిల్లాలకు తాగునీరు అందించారని.. ఈ విషయం రాష్ట్రానికి వచ్చిన కొత్తలో తన సహచరుల ద్వారా తనకు తెలిసిందని జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ అన్నారు. అంతే కాకుండా ఆసుపత్రులు, విద్యాసంస్థలు సైతం స్థాపించి ప్రజలకు సేవ చేస్తున్నారని పిటిషనర్‌కు ఈ సందర్భంగా హైకోర్టు గుర్తుచేసింది. ఇలాంటి విశిష్ట వ్యక్తులను గౌరవించడంలో తప్పేముందంటూ వెంకట సుబ్బయ్యను సూటిగా ప్రశ్నించింది. తాను దాఖలు చేసిన పిల్‌ను వెంకట సుబ్బయ్య వెనక్కి తీసుకోవాలని ఆదేశించింది. లేకుంటే ఖర్చులు విధించి పిల్ కొట్టేస్తామని వార్నింగ్ ఇచ్చింది. నిజంగా ప్రజా ప్రయోజనం ఉన్న వ్యాజ్యాలపై దృష్టి సారించాలని హితవు పలికింది.విచారణ సందర్భంగా భారత హేతువాద సంఘం తరఫున వాదించిన న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్.. లౌకిక రాజ్యంలో మతపరమైన కార్యక్రమానికి ప్రభుత్వ నిధులు వినియోగించడానికి వీలు లేదన్నారు. దీనికి ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్ ప్రణతి కౌంటర్ వాదనలు వినిపించారు. వివిధరకాలుగా ప్రజా సేవ చేసిన 22 మంది వ్యక్తుల జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని కోర్టుకు నివేదించారు. సత్యసాయి నెలకొల్పిన ట్రస్ట్ ద్వారా రాష్ట్రంలో పలు సామాజిక సేవలు అందుతున్నాయని వెల్లడించారు. శ్రీసత్యసాయి సేవలను పరిగణనలోకి తీసుకొని జయంతిని అధికారికంగా నిర్వహించడానికి ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్.. సరైన అధ్యయనం చేయకుండా ప్రభుత్వం ఉత్తర్వులు ఎలా జారీ చేస్తుందని పిటిషనర్‌ను ప్రశ్నించారు.

# పాత జిల్లాలోనే కలిపేయండి

కర్నూలు, అక్టోబరు 31, ఏపీలో జిల్లాల పునర్విభజన వేళ డోన్ నియోజకవర్గ ప్రజలు తమను నంద్యాల నుంచి కర్నూలు జిల్లాలో కలపాలని కోరుతున్నారు. వైద్య, ఉపాధి అవసరాలకు కర్నూలు దగ్గరగా ఉండటమే దీనికి కారణం. గతంలోనూ కర్నూలు జిల్లాలోనే ఉన్న డోన్ వాసులు, ఈ మార్పు తమకు సౌకర్యంగా ఉంటుందని చెబుతున్నారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి కూడా ఈ దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు.ఏపీలో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాల పునర్విభజన, మండలాల పునర్విభజనలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా మరో డిమాండ్ తెరపైకి వచ్చింది. తమను నంద్యాల జిల్లా నుంచి తీసుకెళ్లి కర్నూలు జిల్లాలో కలిపేయాలని డోన్ నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. డోన్ నియోజకవర్గం నంద్యాల జిల్లాలో కలపడాన్ని అక్కడి ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. గతంలో డోన్ నియోజకవర్గం కర్నూలు జిల్లాలోనే ఉండేది. దీంతో డోన్ వాసులు చిన్న అనారోగ్య సమస్యలు వచ్చినా, అత్యవసర పరిస్థితులు ఎదురైనా కర్నూలులోని పెద్దాసుపత్రికి వెళ్లేవారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, నిరుద్యోగులు, కూలీలు కూడా ఉపాధి, ఉద్యోగాల కోసం కర్నూలుకు వెళ్లేవారు. అయితే గత ప్రభుత్వ హయాంలో నంద్యాల జిల్లాలోకి విలీనం అయింది. ఈ మార్పును వ్యతిరేకిస్తూ అప్పట్లోనే ప్రజలు అనేక విజ్ఞప్తులు చేశారు.డోన్ నియోజకవర్గ ప్రజలు తమ ప్రాంతాన్ని కర్నూలు జిల్లాలోనే కొనసాగించాలని కోరుతున్నారు. 2 లక్షలకు పైగా ఓటర్లున్న ఈ నియోజకవర్గంలో, డోన్ పట్టణ, మండలాల నుంచి 90 వేలకు పైగా ఓటర్లు ఉన్నారు. చారిత్రాత్మకంగా, డోన్ ప్రాంతం నుంచి ఎన్నికైనవారు రాష్ట్ర, కేంద్ర మంత్రి పదవులు కూడా చేపట్టారు. ప్రస్తుతం, డోన్‌ను కర్నూలు జిల్లాలో కొనసాగించాలని కోరుతున్నారు. డోన్ నుంచి కర్నూలుకు హైవే మార్గంలో కేవలం 50 కిలోమీటర్ల దూరంలో ఉంది.. 50 నిమిషాల్లోనే చేరుకోవచ్చు. అయితే నంద్యాల జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 90 కిలోమీటర్లు ప్రయాణించి గంట నుంచి గంటన్నర సమయం పడుతుంది.డోన్ ప్రాంత ప్రజలు వైద్య అవసరాల కోసం, ఉపాధి అవకాశాల కోసం కర్నూలు దగ్గరగా ఉండటంతో అక్కడికే వెళ్లడం సౌకర్యంగా ఉందంటున్నారు. నంద్యాలకు కేవలం జిల్లా అధికారులతో పనులుంటేనే వెళ్తున్నారట. ప్యాపిలి మండల ప్రజలు కూడా తమ ప్రాంతాన్ని కర్నూలు జిల్లాలోనే ఉంచితే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. డోన్, ప్యాపిలి ప్రాంతాల ప్రజల్లో 95 శాతం మందికి పైగా తమ ప్రాంతాలను కర్నూలు జిల్లాలోనే కొనసాగించాలని కోరుతున్నారు.డోన్ ప్రజలు కోరుకున్నట్లుగానే కర్నూలు జిల్లాలో విలీనం చేసేందుకు ప్రయత్నిస్తున్నామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి తెలిపారు. 2024 ఎన్నికల సమయంలో కూడా హామీ ఇచ్చామని.. ఇప్పటికే జిల్లాల పునర్విభజనపై నియమించిన మంత్రివర్గ ఉపసంఘం, ముఖ్యమంత్రికి సైతం లేఖను అందజేశామని చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్ లోపు ఈ జిల్లాల పునర్విభజన ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తున్నారు. మరి డోన్‌వాసుల రిక్వెస్ట్‌ను పరిగణలోకి తీసుకుంటారలో లేదో చూడాలి. మరి డోన్ ప్రజల రిక్వెస్ట్‌పై ప్రభుత్వం, కేబినెట్ సబ్ కమిటీ ఎలా స్పందిస్తుందో చూడాలి. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని డోన్‌వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## మేయర్ దంపతుల హత్య కేసు.. ఐదుగురికి ఉరిశిక్ష

చిత్తూరు చిత్తూరు మేయర్ దంపతుల హత్య కేసులో చిత్తూరు ఆరో అదనపు కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. నిందితులు ఐదుగురికి ఉరిశిక్ష విధించింది. ఉరిశిక్ష పడిన వారిలో మేయర్ భర్త తరఫు బంధువు చింటూ కూడా ఉన్నాడు. 2015 నవంబరు 17వ తేదీన చిత్తూరు మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త మోహన్ పై నిందితులు కాల్పులు జరిపి హత్య చేశారు.

# బయిట పడుతున్న నకిలీ నెయ్యి లెక్కలు

తిరుమల, అక్టోబరు 31, మాజీ టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సన్నిహితుడు చిన్న అప్పన్న అరెస్ట్ తో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. అప్పన్న రిమాండ్ రిపోర్టులో కుట్ర కోణాలను సిట్ ప్రస్తావించింది. కల్తీ నెయ్యి కేసులో అప్పన్నను 24వ నిందితుడిగా చేర్చింది. టీటీడీ కొనుగోళ్ల విభాగం జనరల్ మేనేజర్ ను 2022 లో అప్పన్న సంప్రదించాడు. టీటీడీకి నెయ్యి సరఫరా చేసే అన్ని కంపెనీల వివరాలను తీసుకున్నాడు. టీటీడీ నుంచి సేకరించిన వివరాల ఆధారంగా భోలే బాబా డైరీ యాజమాన్యానికి అప్పన్న ఫోన్ చేశారు. బోలే బాబా కంపెనీ ప్రతినిధి పీపీ శ్రీనివాస్‌కు కాల్ చేశాడు. టీటీడీకి సరఫరా చేసే ప్రతి కిలో నెయ్యిపై రూ.25 కమిషన్ ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఇందుకు భోలే బాబా డైరీ యాజమాన్యం కమిషన్ ఇవ్వడానికి నిరాకరించింది. బోలేబాబా డైరీని అనర్హులుగా ప్రకటించేలా చేయడానికి అప్పన్న కుట్ర చేశాడు. బోలేబాబా డైరీ తనిఖీలు చేయాలంటూ టిటిడి ప్రొక్యూర్ మెంట్ జీఎమ్ పై ఒత్తిడి తెచ్చాడు. భోలే బాబా డైరీని అనర్హులుగా ప్రకటించే ప్రయత్నంలో డైరీకి వ్యతిరేకంగా అజ్ఞాత వ్యక్తులతో పిటిషన్లు వేయించాడు. అప్పన్న ఒత్తిడి తేవడం.. కుట్రలతో బోలేబాబా డైరీ నుంచి నెయ్యి సేకరణను టీటీడీ నిలిపివేసింది. భోలే బాబా డైరీ టెండర్ల నుంచి తొలగిపోవడంతో ఆ స్థానంలో ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ ప్రవేశించింది. బోలేబాబా డైరీ కంటే కిలో కు రూ.138 ఎక్కువ కోట్ చేసింది ప్రీమియర్ అగ్రిఫుడ్స్. పోటీ లేకపోవడంతో టీటీడీ నుంచి నెయ్యి సరఫరా కాంట్రాక్టును అగ్రిఫుడ్స్ దక్కించుకుంది. చిన్న అప్పన్నకు రూ.50 లక్షల వరకు ముడుపులు ముట్టినట్లు విచారణలో సిట్ అధికారులు గుర్తించారు. ప్రీమియర్ ఆల్ఫా కంపెనీ సంబంధం ఉన్న హవాలా ఏజెంట్ ద్వారా అప్పన్నకు చేరినట్లు విచారణలో బయటపడింది. ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ ప్రమోటర్లతో అప్పన్న నిరంతరం సంప్రదించినట్లు అధికారులు గుర్తించారు. అప్పన్న బ్యాంకు లావాదేవీలను పరిశీలించి అక్రమాల నిగ్గు తేల్చింది సిట్. తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ కేసులో కుట్రను ఛేదించేందుకు అప్పన్నను సిట్ కస్టడీకి కోరనుంది. మాజీ ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి అక్రమాలను సిట్ గుర్తించింది. భోలే బాబా, ప్రీమియర్ అగ్రి ఫుడ్స్, వైష్ణవి డైరీ నెయ్యి నమూనాలను పరీక్షించాలని 2022 లో అదేశాలు జారీ చేసింది. ఛైర్మన్ ఆదేశాలతో నెయ్యి నమూనాలను సీఎఫ్‌టీఆర్‌ఐ–మైసూరుకు టీటీడీ పంపింది. మైసూర్ సీఎఫ్ టిఆర్ఐ ల్యాబ్ నివేదికల్లో నెయ్యిలో వనస్పతి కల్తీలు ఉన్నట్లు నిర్ధారించారు. ల్యాబ్ నివేదికల్లో నెయ్యి కల్తీని ధృవీకరించినా అధికారులు చర్యలు తీసుకోలేదు. కల్తీ నెయ్యి గుర్తించినప్పటికీ కూడా 2022–2024 మధ్య కొనసాగిన నెయ్యి సరఫరా కొనసాగింది. రెండేళ్ల పాటు రూ.250 కోట్ల విలువైన 68 లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా అయినట్టు సిట్ అధికారులు తెలిపారు. గుత్తేదారు కల్తీ నెయ్యి సరఫరా ద్వారా కిలోకు కిలో సుమారు రూ.250 చొప్పున లాభాలు ఆర్జించినట్లు సిట్ గుర్తించింది. అప్పన్న విచారణతో వెలుగుచూసిన అంశాలతో మరికొందరిని నిందితులుగా చేర్చింది సిట్. మాజీ టీటీడీ ఛైర్మన్ పిఎ చిన్న అప్పన్నతో సహా తొమ్మిది మందిని కొత్త నిందితులుగా చేర్చింది. తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ కేసులో మున్ముందు ఇంకెన్ని సంచలన విషయాలు బయటపడుతాయో వేచి చూడాలి

# ప్రకాశం బ్యారేజ్ కి తప్పిన పెను ప్రమాదం



ఇబ్రహీంపట్నం ప్రకాశం బ్యారేజ్ కి పెను ప్రమాదం తప్పింది. నదిలో కొట్టుకుపోతున్న పడవను ఇబ్రహీంపట్నం మండలం తుమ్మలపాలెం లో స్థానిక జాలర్లు అడ్డుకున్నారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సహకారంతో పడవని ఒడ్డుకు చేర్చి తుమ్మలపాలెం గ్రామం కృష్ణానది ఒడ్డున నిలిపారు. ఎగువ నుండి వస్తున్న వరద నీటిలో కొట్టుకొస్తున్న బోట్ ను స్థానిక జాలర్లు, ప్రభుత్వ యంత్రాంగం కాపాడారు.

# కర్నూలు బస్సు ప్రమాదంలో మూడో వాహనం ప్రమేయం

కర్నూలు అక్టోబరు 31, కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద జరిగిన స్లీపర్ బస్సు ప్రమాదంలో రోజుకో కొత్త కోణం వెలుగులోకి వస్తోంది. మొదట బస్సు వేగంగా వచ్చి బైక్ ని ఢీకొనడం వల్ల ప్రమాదం జరిగిందని అనుకున్నారు. ఆ తర్వాత కింద పడిపోయిన బైక్ ని బస్సు ఢీకొని ఈడ్చుకుంటూ వెళ్లడం వల్ల ప్రమాదం జరిగిందని నిర్ధారించుకున్నారు. ఇప్పుడు ఆ గ్యాప్ లో ఏం జరిగిందనే విషయాలు హైలైట్ అవుతున్నాయి. బైక్ కింద పడిన తర్వాత స్లీపర్ బస్సు ఆ బైక్ ని ఢీకొనే ముందు 14 వాహనాలు అదే రూట్ లో బైక్ ని దాటుకుని వెళ్లాయని పోలీసులు గుర్తించారు. ఈ 14 వాహనాల్లో ఓ బస్సు కూడా ఉంది. ఆ బస్సు బైక్ ని ఢీకొంది కానీ ప్రమాదం ఏమీ జరగలేదు. ఆ బస్సు ఢీకొనడం వల్ల బైక్ కాస్త పక్కకు జరిగింది. అది కూడా డివైడర్ నుంచి జరిగి రోడ్డు మధ్యలోకి వచ్చింది. ఆ తర్వాత స్లీపర్ బస్సు ఢీకొని దాన్ని ఈడ్చుకుని వెళ్లడం వల్ల ఘోరం జరిగిపోయింది. 19మంది సజీవ దహనం అయ్యారు. అదే జరగకపోయి ఉంటే..? కర్నూలు బస్సు ప్రమాదం జరిగిన తర్వాత అలా జరగకపోయి ఉంటే అనే కోణంలో చాలా ప్రశ్నలు, సమాధానాలు వినపడుతున్నాయి. అసలు ఆ బైక్ యాక్సిడెంట్ జరిగి డ్రైవర్ చనిపోకపోయి ఉంటే ఆ రోజు రాత్రి ఆ బైక్ అక్కడ పడి ఉండేది కాదు, అదే లేకపోతే స్లీపర్ బస్సు యధావిధిగా సాఫీగా వెళ్లిపోయేది. సో ప్రమాదం జరిగే ఛాన్సే లేదు. పోనీ బైక్ డివైడర్ ని ఢీకొని పడిపోయింది, డ్రైవర్ శివశంకర్ చనిపోయాడు. అతని స్నేహితుడు శశివశంకర్ శవాన్ని పక్కకు లాగేశాడు కానీ బైక్ ని పక్కకు తీయలేకపోయాడు. ఈలోగా వరుసగా వాహనాలు రావడంతో అతను భయపడి పారిపోయాడని తెలుస్తోంది. ఒకవేళ అతడు బైక్ ని కూడా పక్కకు లాగగలిగి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదు. అది కూడా తీసేద్దాం. స్లీపర్ బస్సు, బైక్ ని ఢీకొని లాక్కెళ్లే లోపల 14 వాహనాలు అటుగా వెళ్లాయి. అందులో ఏ ఒక్క వాహనం ఆగి చూసినా ఆ బైక్ ని ఎవరో ఒకరు పక్కకు తీసేవారు. అప్పుడు కూడా ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదు. ఇక చివరిగా ఆ బైక్ ని ఢీకొన్న మరో బస్సు ఈ ప్రమాదానికి అసలు కారణంగా తెలుస్తోంది. ఆ బస్సు ఢీకొనడం వల్లే బైక్ డివైడర్ పక్కనుంచి కాస్త జరిగి రోడ్డు మధ్యలోకి వచ్చింది. దీంతో స్లీపర్ బస్సు దాన్ని ఢీకొని ఘోర ప్రమాదానికి కారణం అయింది. 19మంది ప్రయాణికులు సజీవ దహనం అయ్యారు. ఆ మూడో వాహనం.. స్లీపర్ బస్సు ఢీకొనడానికి ముందు ఆ బైక్ ని ఢీకొన్న వాహనం ఇప్పుడు హైలైట్ అవుతోంది. అది ఒక ఓమ్నీ బస్సు. ఆ బస్సు నడిపిన డ్రైవర్ గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. బైక్ రోడ్డుకి అడ్డుగా పడి ఉంది, దాన్ని తన బస్సు తాకింది అని తెలిసిన వెంటనే కనీసం ఆ డ్రైవర్ పక్కన బస్సు ఆపి దాని వద్దకు వెళ్లి ఉండాలి, లేదా వెనక వచ్చే వాహనాలను అప్రమత్తం చేసి ఉండాలి. అవేవీ జరగకపోవడం వల్ల ఈ ఘోరం జరిగిపోయింది. అంటే ఇక్కడ 19మంది ప్రయాణికులు చనిపోవడానికి కారణాలు అనేకం. ఇక్కడ నిర్లక్ష్యం ఒక్కరిదే అని చెప్పడానికి లేదు. అందరి నిర్లక్ష్యం కలగలిసి ఆ ప్రమాదానికి కారణం అయింది. చిట్టచివరిగా స్లీపర్ బస్సు డ్రైవర్ మంటలు చూసి పారిపోయాడే కానీ, ప్రయాణికుల్ని హెచ్చరించలేదు. అదే జరిగి ఉంటే కనీసం మరణాల సంఖ్య బాగా తగ్గి ఉండేది. అదృష్టం బాగుంటే అందరూ ప్రాణాలతో బయటపడేవారు. కానీ బస్సు డ్రైవర్ ఆ పని చేయలేదు. మంటలు చెలరేగగానే బస్సుని ఆపేసి భయంతో పరుగులు తీశాడు. కనీసం ఏ ఒక్కర్నీ అలర్ట్ చేయలేదని తెలుస్తోంది. ఇలా అందరి నిర్లక్ష్యం ఆ బస్సుని మంటల్లోకి నెట్టేసింది. 19మంది ప్రయాణికులు సజీవ దహణం కావడానికి కారణం అయింది

## అయ్యోనివా.. నువ్వు అవ్వోనివా... తెలంగాణకు నువ్వు పాలోడివా అంటూ ప్రశ్నించిన కవి రచయిత గూడ అంజన్న

## -నేడు ఆయన జయంతి



అయ్యోనివా.. నువ్వు అవ్వోనివా... తెలంగాణకు నువ్వు పాలోడివా అంటూ ప్రశ్నించిన కవి రచయిత గూడ అంజన్న. ఆయన తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రముఖ గేయ కవి, కథా రచయిత.లక్ష్మమ్మ, లక్ష్మయ్య దంపతులకు 1955లో ఆదిలాబాద్ జిల్లా, దండేపల్లి మండలం, లింగాపురం గ్రామంలో అంజయ్య జన్మించాడు. ఆయనకు ఐదుగురు సహోదరులున్నారు. ఆయన ప్రాథమిక విద్యను లింగాపురం గ్రామంలో చదివారు. ఇంటర్మీడియట్ వరకు లక్సెట్టిపేటలో చదివిన ఆయన. తర్వాత హైదరాబాద్ లో బీ ఫార్మసీ పూర్తి చేశారు. ఫార్మసిస్టుగా కూడా పనిచేశారు.నలభై ఏళ్లుగా కవిగా, రచయితగా ఎన్నో కథలు, పాటలు రాసిన అంజయ్య కలకాలం నిలిచిపోయే పాటలు రాశాడు. వీటన్నింటికి తోడు సినిమాల్లో పాటలు రాసిన తర్వాత తెలుగు నేల నలుమూలలా ఆబాలగోపాలం అందరి నోళ్లలో నానుతున్నాడు. వృత్తిరీత్యా హైదరాబాద్‌లో ఫార్మసిస్ట్‌గా పనిచేశాడు. ఆయన పక్షవాతం వ్యాధితో బాధపడుతున్నప్పుడు తెలంగాణ ప్రభుత్వం వైద్యం చేయడానికి ముందుకు వచ్చింది.ఆయన వ్రాసిన “ఊరు మనదిరా” పాట 16 భాషలలో అనువాదమయింది. ఆయన తెలంగాణ సాంస్కృతిక సంఘ నాయకునిగా పనిచేసాడు.పల్లెలో పుట్టి పెరిగారు కాబట్టే.. ఆ వాతావరణం.. అక్కడి పరిస్థితులే ఆయన పాటలకు ప్రాణమయ్యాయి. పేదల కన్నీళ్లే ఆయన కలంలో సిరా అయ్యాయి. వారి గోసను ప్రపంచానికి చాటి చెప్పాయి. అందుకే ప్రజా కవుల్లో గూడ అంజయ్యది ప్రత్యేక స్థానం. ఆయన ఎవరికి అందని సాహితీ శిఖరం.బడికి పోతున్న సమయంలో దారినపోతున్న ఒక రైతును పలకరించగా ఊరిడిసి పోవన్నా..ఉరిపెట్టుకోవన్నా... అన్న మాటలే తన తొలి పాటకు అన్న ప్రాసన చేశాయని..తను కళ్లారా చూసిన కష్టాలకు, వాటిని అనుభవిస్తున్న వారి నోట వచ్చిన మాటల స్ఫూర్తిగా పాటలల్లడం తనకు బాల్యంలోనే అబ్బిన విద్య అని అసలేని వానల్ల ముసలెడ్లు కుట్టుకొని.. అనే ఆయన తొలిపాట పుట్టుకకు నేపథ్యం అదేనని అంజయ్య ప్రతి సభలోనే చెప్పేవాడు.చిరుత ప్రాయమునాడే అన్నన్నివేశం బాధ కలిగిస్తే ముందుగా తానే ఏడుస్తారు. అందుకే ఆయన పాటలు ప్రజల గుండెలను అంతలా హత్తుకుంటాయి. కేవలం ప్రజా సమస్యలే కాదు.. తెలంగాణ పోరాటంలోనూ గూడ అంజయ్య కీలక పాత్ర పోషించారు. తొలి దశ ఉద్యమంలో అనేక ఆందోళనల్లో పాల్గొన్నారు. 1975లో ఎమర్జెన్సీ టైంలో తెలంగాణ నినాదంతో ముందుకెళ్లడంతో.. జైలు జీవితం కూడా గడపాల్సి వచ్చింది. అయినా ప్రజా ఉద్యమ బాటను వీడలేదు. మలిదశ ఉద్యమంలోనూ తనవంతు పాత్ర పోషించారు అంజయ్య. పాటలతో ఉద్యమానికి ప్రాణం పోశారు. రసమయి బాలకిషన్ తో కలిసి ధూం?ధాం.. ప్రారంభించి ఉద్యమానికి కొత్త శక్తినిచ్చారు. అయ్యోనివా.. అవ్వోనివా అంటూ వలస పాలకులను ప్రశ్నిస్తూ.. ఉస్మానియా క్యాంపస్ లో ఉదయించిన కిరణమా అంటూ యువతలో పోరాట స్ఫూర్తిని నింపారు. దళితులపై కొనసాగుతున్న వివక్షపైనా పోరాటం చేశారు అంజయ్య. చిన్న వయస్సులోనే జనం కష్టాలకు అక్షర రూపమిచ్చారు. అంటే అప్పటికే ఆయన సమాజాన్ని ఎంత లోతుగా అర్థం చేసుకున్నారో దీన్ని తెలుసుకోవచ్చు. ఆ రోజుల్లో ఊళ్లో వడ్డీ వ్యాపారుల అకృత్యాలకు బలైన ఓ పెద్దాయన చెప్పిన మాటలను? పాటగా మార్చి రచనారంగంలో తొలి అడుగేశారు అంజయ్య. ఏదో పాట రాయాలని రాసే వ్యక్తి కాదు గూడ అంజయ్య. పరిస్థితిని, సంఘటనను ముందుగా తాను ఫీల్ అయ్యి రాసే వ్యక్తి. జనం బాధను తన బాధగా భావించే సాహితీవేత్త అంజయ్య. ఆయన పాట సజీవమైనది. వారిపైన జరుగుతున్న దాడులను ప్రశ్నించారు. అంజయ్య పాటలు మనసును హత్తుకోవడమే కాదు.. ఆలోచన రేకెత్తిస్తాయి. అందుకే.. జీవిత సత్యాలు తెలియకుంటే పాటలు రాయలేమంటారు అంజయ్య. అదీలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో విప్లవోద్యమ నిర్మాణం జరుగుతున్న సమయంలో ఈ పెత్తందార్ల పాలనలో పీడిత జనానికి విముక్తి లేదని, జన ఐక్యతతో ప్రజోద్యమాల ద్వారా శ్రామిక రాజ్యం స్థాపించడమే ఏకైక మార్గమని నమ్మి ఉద్యమ బాటలో పయనించాడు. ఉన్నత చదువులకోసం హైదరాబాద్ హాస్టల్‌కు మకాం మార్చిన అంజన్నకు ప్రపంచ ఉద్యమాల పరిచయం ఏర్పడింది. తనలాగే జనం కోసం పాకులాడే వారు హైదరాబాద్‌లో చాలామంది ఉన్నారని తెలుసుకున్న అంజయ్య వారందరిని కలుపుకున్నాడు. అరుణోదయ సాంస్కృతిక సంస్థను స్థాపించి జనంనోట విన్న పదాలనే పాటలుగా రాసి బాణీలు కట్టి తెలుగురాష్ట్రం మెత్తం తిరుగుతూ ప్రజల నుండి నేర్చుకుంటూ, ప్రజల ఆలోచనల్లో మార్పుకోసం తన పాటల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని కలిగించాడు. మహాకవి శ్రీశ్రీతో అనేక సభల్లో పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి, అరుణోదయ కళాసంస్థల ద్వారా తన గళాన్ని ప్రపంచానికి వినిపించారు. తెలంగాణ సాంస్కృతిక సంఘ నాయకుడిగా కూడా పనిచేశారు. పలు సినిమాల్లోనూ నటించారు. అవార్డుల కోసం ఏనాడు పాట రాయలేదంటారాయన. కేవలం పేదోడికోసమే తన పాటను అంకితం చేశానని ధైర్యంగా చెబుతారు. వచ్చిన అవార్డులతోనే సంతృప్తి చెందారు. జనంలోంచి వచ్చిన జానపదమే తన ప్రాణపాదమని నమ్మి? చివరివరకు అదే మాటపై ఉన్నారు. 1988 రజనీ తెలుగు సాహితీ సమితి అవార్డు, 1986లో సాహిత్య రత్న బంధు, 2000 లో గండె పెండేరా బిరుదుతో సత్కారం, 2004లో నవ్య సాహిత్య పరిషత్ నుంచి డాక్టర్ మలయశ్రీ సాహితీ అవార్డు అంజయ్యను వరించాయి. 2015లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాహితీ పురస్కారంతో సత్కరించింది. 2015లో సుద్దాల హన్మంతు-జానకమ్మ స్మారక పురస్కారాన్ని అందుకున్నారు.కొంతకాలంగా కామెర్లు, మూత్రపిండాల వ్యాధితో బాధపడిన ఆయన జూన్ 21, 2016 రంగారెడ్డి జిల్లా రాగన్నగూడలోని స్వగృహంలో ప్రాణాలు విడిచాడు.

# కళ్యాణదుర్గంలో వైసీపీకి షాక్

అనంతపురం, అక్టోబరు 31, ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత చాలామంది నేతలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. అయితే ఇటీవల పార్టీకి రాజీనామాలు తగ్గాయి కానీ.. చాలా మండలాలతో పాటు మున్సిపాలిటీల్లో ఆ పార్టీ పట్టు కోల్పోయింది. అవిశ్వాస తీర్మానాల్లో వీగిపోయింది. రజక అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో వైసీపీకి గట్టి దెబ్బ తగిలింది. మున్సిపల్ చైర్మన్ గా ఉన్న తలారి రాజ్ కుమార్ ను ప్రభుత్వం తప్పించింది. మున్సిపల్ చైర్మన్గా ఉన్న రాజ్కుమార్ గత 15 నెలలుగా కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయకుండా అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై సెప్టెంబర్ 22న ఏపీ ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దానిపై సరైన వివరణ ఇవ్వకపోవడంతో ఆ పదవి నుంచి రాజ్ కుమార్ ను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో మున్సిపల్ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. కళ్యాణ దుర్గం మున్సిపల్ చైర్మన్ గా రాజ్ కుమార్ ఎన్నికయ్యారు. 2024 ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయిన తరువాత పరిస్థితి మారింది. 2024 నవంబర్ నుంచి 2025 ఏప్రిల్ వరకు కనీసం కౌన్సిలింగ్ మీటింగు జాడలేదు. దీంతో ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై పలుమార్లు మున్సిపల్ చైర్మన్ కు రాజకీయ హెచ్చరికలు కూడా వెళ్లాయి. ఆయన పెద్దగా పట్టించుకోలేదు. మరో నాలుగు నెలల్లో పదవీకాలం ముగియనుండడంతో తేలిగ్గా తీసుకున్నారు. కానీ ప్రభుత్వం దీనిపై గట్టి చర్యలకు దిగింది.తోపుడు బండి వ్యాపారిగా.. కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్మన్ గా ఉన్న తలారి రాజ్ కుమార్ ఒక సామాన్య వైసీపీ కార్యకర్త. తోపుడు బండి పై పండ్ల విక్రయించే సామాన్య వ్యాపారి. 2021 కి ముందు అలానే చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. కానీ వైసీపీ పై అభిమానంతో ఆ పార్టీ కార్యకర్తగా పనిచేసేవారు. ఈ క్రమంలో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఆయనకు లభించింది. కళ్యాణదుర్గం పదో వార్డు నుంచి కౌన్సిలర్ గా పోటీ చేసి గెలుపొందారు. అయితే ఆయనకు అనూహ్యంగా చైర్మన్ పదవి వరించింది. కానీ రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత స్థానిక రాజకీయాల నేపథ్యంలో అనేక రకాల మార్పులు వచ్చాయి. ఈ తరుణంలోనే మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించలేదని ఆయనపై ప్రభుత్వం వేటు వేసింది.

# దశ, దిశను మార్చే గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్

న్యూఢిల్లీ, అక్టోబరు 31, అండమాన్ నికోబార్ సముద్రప్రాంతాల్లో భారత్‌కు కీలక ద్వీపం. కొన్ని రోజులుగా ఈ ద్వీపం వార్తల్లో నిలుస్తోంది. కారణం.. గ్రేట్ నికోబార్ ప్రాజెక్టు. దేశానికి వ్యూహాత్మక మని, అభివృద్ధికి కీలకంగా మారుతుంది అని కేంద్రం చెబుతోంది. ఇక విపక్షాలు మాత్రం దీనిని ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నాయి. పర్యావరణ హాని అంటూ 70 మంది మేధావులు కేంద్రానికి లేఖ రాశారు. ఇక బీజేపీ మాత్రం దీనిని చైనా ప్రేరేపిత చర్యగా ఆరోపిస్తోంది.

నీతి ఆయోగ్ రూపకల్పన చేసిన 81 వేల కోట్ల రూపాయల ఈ ప్రాజెక్టులో అంతర్జాతీయ కంటైనర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ పోర్టు, గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం, టౌన్‌షిప్, గ్యాస్‌సోలార్ విద్యుత్ ప్లాంట్ వంటి మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ఇవి అన్నీ కలిపి గ్రేట్ నికోబార్‌ను వ్యూహాత్మక, ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నం. మలక్కా జలసంధి నుంచి 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ద్వీపం సముద్ర భద్రతలో కీలకం. అక్కడ నేవీఎయిర్‌ఫోర్స్ శాశ్వత స్థావరం ఏర్పడితే, భారత్ ఇండో?పసిఫిక్‌లో కీలకంగా మారుతుంది. చైనా ఆధిపత్యానికి చెక్ పడుతుంది. చైనా చేపడుతున్న ‘స్ట్రింగ్ ఆఫ్ పెరల్స్’ వ్యూహాన్ని తిప్పికొట్టేందుకు ఇది వ్యూహాత్మక అడుగుగా భావిస్తున్నారు.సింగపూర్ వంటి పోర్టులతో పోటీ ఇవ్వగల ఈ ట్రాన్స్‌షిప్‌మెంట్ పోర్టు ద్వారా ప్రపంచ కంటైనర్ వాణిజ్యంలో భారత్ కొత్త హబ్‌గా ఎదగవచ్చు. స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు, పర్యాటకంగా దీవుల ఆదరణ పెరగడం వంటి లాభాలు కూడా ఉన్నాయని కేంద్రం చెబుతోంది. మొదటి దశ పనులు 2028 కల్లా పూర్తవుతాయని అంచనా.ఇదే ప్రాజెక్టుపై విపక్షం మొత్తం వ్యతిరేకత తెలుపుతోంది. గలతియా బే సమీప సముద్రతీరంలో తాబేళ్ల గుడ్ల ప్రాంతానికి నష్టం, లక్షల చెట్ల నరికివేత, సముద్ర జీవాల అంతరాయం వంటి అనేక పర్యావరణ సమస్యలు ప్రస్తావించబడుతున్నాయి. షోంపెన్, నికోబారీ జనసమూహాలు బయటి ప్రభావంతో నష్టపోతాయని, జీవరాశుల జీవనశైలికి భంగం కలుగుతుందని మేధావులు హెచ్చరిస్తున్నారు. కేంద్రం మాత్రం ఈ వాదనలను తరచూ రాజకీయ ప్రేరేపితమని కొట్టిపారేసింది.

ఆ గిరిజనులను సమగ్ర అభివృద్ధి వైపు తీసుకురావడమే లక్ష్యమని, పర్యావరణ సమతుల్యతకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెబుతోంది.గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్‌పై భిన్న అభిప్రాయాల మధ్య అసలు కథ అంతర్జాతీయ భద్రతలో దాగి ఉంది. చైనా చుట్టుముట్టే సముద్ర మార్గాల నుంచి ఇండియా తానూ సర్కిల్ రూపొందించుకోవడం మొదటి ప్రయత్నం. నేవీ, ఇంటెలిజెన్స్ వలయాలు బలపడితే ఇండో?పసిఫిక్ సముద్రరహదారులపై భారత్ అధిపత్యం సాధించగలదు.

ఈ ప్రాజెక్టు ఒక వైపు పచ్చదనం, మరో వైపు జాతీయ భద్రత. కానీ ఒక సత్యం మాత్రం స్పష్టం. ఈ దీవి చిన్నదైనా, దాని మీద ఆధారపడే నిర్ణయాలు వచ్చే దశాబ్దాల్లో భారత భవిష్య దిశను మార్చగలవు

# విచారణ షురూ...

కడప, అక్టోబరు 21,: ఏదైనా నేరంతో తమకు సంబంధం లేకపోతే నిష్పక్షపాతంగా విచారణ జరిపించుకోవచ్చని ఎక్కువ మంది సూచిస్తారు. తమ తప్పు లేదన్నప్పుడు విచారణ ఎలా చేస్తే తమకెందుకులే అన్నట్టు ఉంటారు. కానీ మాజీ మంత్రి వైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితులు మాత్రం తమపై విచారణ నిలిపివేయాలని పిటిషన్లు దాఖలు చేయడం విశేషం. 2019 మార్చి 15న దారుణ హత్యకు గురయ్యారు వివేకానంద రెడ్డి. అప్పట్లో సిఐడి విచారణకు ఆదేశించింది టిడిపి సర్కార్. అయితే ఎట్టి పరిస్థితుల్లో సిబిఐ విచారణ చేయాల్సిందేనని పట్టుపట్టారు అప్పటి విపక్షనేత జగన్మోహన్ రెడ్డి. టిడిపి సర్కార్ సిబిఐ విచారణకు ఆదేశించింది. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చారు. సిబిఐ విచారణ అవసరం లేదని తేల్చేశారు. చివరకు వివేకానంద రెడ్డి కుమార్తె సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో సిబిఐ దర్యాప్తు అనివార్యం అయింది. గత ఐదేళ్లలో సిబిఐ విచారణ కొనసాగింది. దర్యాప్తు ముగించినట్లు సిబిఐ కోర్టుకు నివేదించింది. కానీ అసలు విచారణ జరపకుండా ముగిసింది అని చెప్పడం సరికాదని వివేక కుమార్తె సునీత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు కింది కోర్టులో కేసు విచారణను మళ్లీ ప్రారంభించాలని పిటీషన్ దాఖలు చేయడం విశేషం.నాంపల్లి సిబిఐ కోర్టులో సునీత పిటిషన్ దాఖలు చేశారు. మళ్లీ విచారణ ప్రారంభించాలని సిబిఐకి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అయితే ఇప్పటికే సిబిఐ విచారణ ముగిసిందని.. మరోసారి ప్రారంభించవద్దని ఈ హత్య కేసులో నిందితులు కౌంటర్ పిటిషన్లు వేశారు. ఒక్క అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్ రెడ్డి తప్ప అందరూ పిటిషన్లు దాఖలు చేశారు. వారికి కూడా గడువు ఇచ్చింది కోర్ట్. తప్పకుండా వారుసైతం విచారణ వద్దని కచ్చితంగా పిటిషన్లు దాఖలు చేస్తారు. ఎందుకంటే వివేకానంద రెడ్డి హత్య కేసులో తమ ప్రమేయం లేదని.. అదంతా కుటుంబ వ్యవహారమని? ఆస్తి కోసమే సునీత, ఆమె భర్త చేయించారని సాక్షిలో ప్రత్యేక కథనాలు రాయించారు. ఆపై గత ఐదేళ్లుగా సిబిఐ విచారణకు వైసీపీ ప్రభుత్వం సహాయ నిరాకరణ చేసింది. అప్పటి సాక్షాలను సైతం చెరిపేసినట్లు వార్తలు వచ్చాయి. ఇవన్నీ ముగిసిన తర్వాత ఇప్పుడు విచారణ ఎందుకన్నది ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుల అభిప్రాయం.ప్రస్తుతం నాంపల్లి సిబిఐ కోర్టు ఆదేశాల కోసం యావత్ తెలుగు రాష్ట్రాలు ఎదురుచూస్తున్నాయి. ఒకవేళ కోర్టు సిబిఐ విచారణ మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాలని ఆదేశిస్తే సంచలనమే. లేదు ఇప్పటివరకు జరిగిన విచారణ ఓకే అని చెప్పినా సంచలనమే. మరోసారి విచారణ అంటే మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికరమే. ఎందుకంటే సిబిఐ విచారణకు ఏపీ పోలీస్ శాఖ సంపూర్ణంగా సహకరిస్తుంది. విచారణలో సంచలన అంశాలను బయటపెట్టి అవకాశం ఉంది. స్వేచ్ఛగా విచారణ చేపట్టేందుకు ఛాన్స్ ఉంటుంది. అదే జరిగితే వివేకానంద రెడ్డి హత్య కేసులో ఒక్క కడప ఎంపీ అవినాష్ రెడ్డి ఉన్నారా? లేకుంటే ఆ పై స్థానాల్లో ఉన్నవారు ఉన్నారా? అనేది బయటకు రానుంది. అయితే ఏ క్షణం అయినా నాంపల్లి సిబిఐ కోర్టు.. వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణకు సంబంధించి సంచలన ఆదేశాలు ఇచ్చే అవకాశం

# అమెరికా, చైనాల కొత్త ప్రయాణం...

న్యూఢిల్లీ, అక్టోబరు 31, (న్యూస్ పల్స్) అగ్రరాజ్యం అమెరికా? రెండో అగ్రరాజ్యం చైనా.. ఈ రెండు దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. ట్రంప్ 2.0 పాలనలో చైనాపై సుంకాలతో విరుచుకుపడుతున్నాడు. చైనా కూడా ఎక్కడా వెనక్కి తగ్గడం లేదు. అమెరికా దిగుమతులపైనా సుంకాలు విధిస్తోంది. మరోవైపు అమెరికాకు ఎగమితి చేసే రేర్ ఎర్త్ మినరల్స్‌పై పట్టు బిగిస్తోంది. దీంతో ఇరు దేశాల మధ్య కోల్డ్ వార్ కొనసాగుతోంది. ఇలాంటి తరుణంలో ఇరు దేశాల అధినేతలు తాజాగా భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. దక్షిణ కొరియా నగరం బూసాన్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ మధ్య గురువారం జరిగిన భేటీ ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. రెండు గంటలపాటు ముగిసిన ఈ చర్చలు గత కొన్ని నెలలుగా ఉత్కంఠ రేపిన వాణిజ్య ఉద్రిక్తతలకు కొంత ఊరట తీసుకువచ్చాయి.చైనాపై విధించిన 20 శాతం ఫెంటనిల్ టారిఫ్‌ను 10 శాతానికి తగ్గించారని ట్రంప్ ప్రకటించారు. ఫెంటనిల్ ముడి పదార్థాల అక్రమ రవాణాను అరికట్టే అంశంపై జిన్ పింగ్ వ్యక్తిగతంగా కట్టుబడి ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నిర్ణయం అమెరికాలో పెరుగుతున్న ఓపియాయిడ్ వ్యసన సంక్షోభానికి పరిష్కారం కోసం ద్వైపాక్షిక సహకారానికి నాంది అని పరిశీలకులు అభిప్రాయపడ్డారుఇక ఇదే సమయంలో అరుదైన ఖనిజాల సరఫరాలో ఇటీవల తలెత్తిన సంక్షోభం ఈ సమావేశంలో పరిష్కారమైంది. ఇరుదేశాలు ఒక సంవత్సర కాలానికి ఎగుమతి?దిగుమతి నిర్బంధాలపై సడలింపు ఇవ్వడానికి అంగీకరించాయి. గతంలో 100 శాతం సుంకాల హెచ్చరికలు అమెరికా నుంచి రావడం, ఇప్పుడు వాటి ఉపసంహరణ చైనా పరిశ్రమలకు ఉపశమనం తీసుకువచ్చింది. చైనాతో రైతు ఉత్పత్తుల వ్యాపారం మళ్లీ మొదలవుతుందని ట్రంప్ ప్రకటించారు. అమెరికా సోయాబీన్ ఎగుమతులకు చైనా తక్షణ అనుమతి ఇవ్వడంతో మధ్య పశ్చిమ రాష్ట్రాల వ్యవసాయ రంగానికి ఇది కీలక మలుపుగా మారనుంది.ట్రంప్ ప్రకారం, యూరప్ సంక్షోభ పరిష్కారంలో చైనా సహకరించడానికి అంగీకరించింది. ఈ అంశం వాషింగ్టన్?బీజింగ్ సంబంధాలను కేవలం ఆర్థికం దాటి గ్లోబల్ భద్రతా స్థాయి వరకు విస్తరింపజేసే అవకాశముంది. ఈ చరిత్రాత్మక భేటీ ఎయిర్‌పోర్టు పరిధిలో జరగడం ఆశ్చర్యం కలిగించింది. అయితే సమయాభావం కారణంగా తక్షణంగా ఈ వేదికను ఎంచుకున్నట్లు తెలింది. షెడ్యూల్ ప్రకారం ట్రంప్ వెళ్లే ముందు చివరి నిమిషంలో భేటీ ఏర్పాటు కావడంతో అది తాత్కాలిక ప్రదేశంలో పూర్తయింది.ప్రసంగంలో ట్రంప్ జిన్ పింగ్‌ను ‘తన కాలంలో అత్యంత మేధావి నాయకుడు’గా చిత్రీకరించారు. “10లో 12 మార్కులు ఆయనకు ఇవ్వగలను” అని ఆయన వ్యాఖ్యలు రెండు దేశాల మధ్య వ్యక్తిగత సాన్నిహిత్యాన్ని ప్రతిబింబించాయి.ఈ భేటీతో తాత్కాలిక ఉద్రిక్తత తగ్గినప్పటికీ, పూర్తి వాణిజ్య ఒప్పందానికి మార్గం ఇంకా ప్రారంభ దశలోనే ఉందని నిపుణులు భావిస్తున్నారు. అమెరికా వచ్చే ఏడాది చైనాపై వాణిజ్య విధానాల్లో సడలింపు ఇచ్చే అవకాశం ఉందన్న సంకేతాలు ఈ సమావేశం ద్వారా వెలుగులోకి వచ్చాయి.

# ముగ్గురికి ప్రతిష్టాత్మకం..

# గెలుపుఎవరిదో...

హైదరాబాద్, అక్టోబరు 31, తెలంగాణలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్‌తోపాటు ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీకి చాలా కీలకంగా మారింది. ఈ మూడు పార్టీలకు చెందిన ముగ్గురు నేతలకు ఇక్కడ గెలవడం చాలా అవసరం. ఇక్కడ ఓడితే ఆ నేతల ఇమేజ్ డ్యామేజ్ కావడం కాయం.

అందుకే మూడు పార్టీల నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంపై ఇప్పటికే అసంతృప్తి స్వరాలు పెరుగుతున్నాయి. మరోవైపు అధిష్టానం వద్ద కూడా ఇమేజ్ డ్యామేజ్ అవుతోంది. ఇలాంటి తరుణంలో ఈ ఉపఎన్నిక గెలవకపోతే నాయకత్వ స్థిరత్వంపై సందేహాలు తీవ్రమవుతాయి. ఈ నేపథ్యంలో ఎంఐఎం మద్దతు తీసుకోవడం వల్ల కాంగ్రెస్, బీజేపీ మధ్య మ్యాట్రిక్స్ ఎలా కుదుటపడుతుందన్నది ప్రధాన ప్రశ్న.2018, 2023లో బీఆర్ఎస్ జూబ్లీహిల్స్‌లో ఘన విజయం సాధించింది. మాగంటి గోపీనాత్ గెలిచారు. ఆయన మరణంతో ఉప ఎన్నిక వచ్చింది. సిట్టింగ్ స్థానం నిలుపుకోవడానికి బీఆర్ఎస్ గోపీనాథ్ భార్యకు టికెట్ ఇచ్చింది. ఇక గోపీనాథ్‌ది ఆంధ్రా నేపథ్యం. జూబ్లీహిల్స్‌లో ఆంధ్రులు ఎక్కువే. అయితే ఈసారి బీజేపీ కూడా ఆంధ్రా ఓటర్లకు గాలం వేస్తోంది. టీడీపీ రహస్యంగా మద్దతు ఇస్తోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్ నాయకత్వానికి ఈ గెలుపు ఒక పరీక్ష. ఇక్కడ గెలిస్తే.. మరింత దూకుడు ప్రదర్శించే అవకాశం ఉంటుంది. కేడర్‌లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ప్రజా సమస్యలపై దూకుడు పెంచే అవకాశం ఉంటుంది.రాంచందర్‌రావు అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత జరుగుతున్న తొలి ఎన్నికలు ఇవీ. రాష్ట్ర పార్టీ, కేంద్ర బాధ్యతలు సమన్వయంగా నిర్వహించేవి కావడంతో బీజేపీ గెలుపు ద్వారా పార్టీ క్రెడిబిలిటీని బలోపేతం చేయాలని లక్ష్యం.

ఇదే సమయంలో జూబ్లీహిల్స్ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉంది. అందుకే ఆ పార్టీకి గెలుపు తప్పనిసరి.జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 1.37 లక్షలమంది ముస్లిం ఓటర్లు ఉన్నారు. గత ఎన్నికల్లో ఎంఐఎం తరపున నవీన్ యాదవ్ పోటీ చేశారు. ఈసాకి కాంగ్రెస్ తరపున బరిలో దిగాడు. మరోవైపు ఎంఐఎం ఈసారి కాంగ్రెస్‌కు లోపాయకారి మద్దతు ఇస్తోంది. అయితే గత ఎన్నికల్లో ఎంఐఎంకే 30 వేల ఓట్లు మాత్రమే వచ్చాయి. 2018, 2023 ఎన్నికల్లో ముస్లింలు మాగంటి గోపీనాథ్‌కు అంగా నిలిచారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఈసారి కూడా విజయంపై ధీమాగా ఉంది. అయితే దీనికి చెక్ పెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి మైనారిటీ వర్గానికి చెందిన అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చారు.

ఇది కాంగ్రెస్‌కు ప్లస్ పాయింట్‌గా మారే అవకాశం ఉంది.కాంగ్రెస్ పార్టీ.. ముస్లింల మద్దతు, అధికారంలో ఉండడం బలంగా భావిస్తోంది. అభివృద్ధిని కూడా ప్రచారం చేస్తోంది. ఇక బీఆర్ఎస్ గోపీనాథ్ చేసిన అభివృద్ధిపైనే నమ్మకంతో ఉన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి గెలిపిస్తుందని ధీమాగా ఉన్నారు. ఇక బీజేపీ కూడా కేంద్రం నిధులతో చేసిన అభివృద్ధి, కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండడంతో మరింత అభివృద్ధి చేస్తామని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. దీంతో రేసులో గెలుపు ఎవరిదో అని మూడు పార్టీల నేతలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

# మూసీ ప్రక్షాళనకు అడగడగునా అడ్డంకులు

నల్గొండ, అక్టోబరు 31, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెద్ద ప్రాజెక్టుల్లో ఒకటైన మూసీ ప్రాజెక్ట్ ఆధునీకరణకు నోచుకోక అంధకారంలో కొట్టుమిట్టాడుతుంది. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మూసీ ప్రాజెక్టు పరిస్థితి ఉంది. సోలిపేట గ్రామం వద్ద మూసీనదిపై 1954 సంవత్సరంలో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి 1963 సంవత్సరంలో పూర్తి చేశారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన ఐదేళ్ల వరకు ఎడమ కాలువ 41 కిలోమీ టర్లు, కుడికాలువ 38 కిలోమీటర్ల పొడవున మొత్తం 42 గ్రామాల రైతులకు సాగునీరందించింది.ప్రస్తుతం ప్రాజెక్టులో పూడిక పెరిగిపోవడంతో 30 వేల ఎకరాలకు ఆయకట్టుకు పడిపోయింది. పాలకులు మారుతున్న మూసీ ప్రాజెక్టు పై నిర్లక్ష్యం మాత్రం వీడటం లేదు. ప్రాజెక్టు మీద నిర్మించిన రక్షణ గోడలకు రక్షణ లేకుండా పోయింది.. వెదురు కర్రలేదిక్కయ్యాయి. పర్యాటకులతో, అతిధులతో కిటకిటాడాల్సిన అతిథిగృహం శిధిలావస్థలో ఉంది. క్లస్టర్ గేట్ల నుండి ,ప్రాజెక్టు రక్షణ గోడల నుండి నుండి నీరు లీకేజ్ అవుతున్న పట్టించుకునే వారే కరువయ్యారు.ప్రాజెక్టుపై ఆరుగురు పర్మనెంట్ ఉద్యోగులు, నలు గురు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం ప్రతి సంవత్సరం కేటాయించే నిధులు సరిపోక మరమ్మతులు పూర్తి స్థాయిలో జరగటం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉమ్మడి జిల్లా మంత్రులు మూసీ ప్రాజెక్టు పై ప్రత్యేక దృష్టి పెట్టి ఆధునీకరణకు పూనుకొని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారుమూసి ప్రాజెక్ట్ 6700 ఎకరాలలో విస్తరించి ఉంది 4.46 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న ప్రాజెక్ట్ రోజురోజుకు పూడిక పెరగడంతో సామర్థ్య స్థాయి తగ్గిపోతుంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల పరిధిలో నకిరేకల్, సూర్యాపేట, నల్లగొండ, మిర్యాలగూడెనీ నియోజకవర్గాలకు సాగునీరు అందుతుంది.కుడి కాల్వ పరిధిలో కేతేపల్లి, మాడ్గులపల్లి, తిప్పర్తి, వేములపల్లి మండలాల్లో 23 చెరువులు, ఎడమ కాలువ పరిధిలో సూర్యాపేట, చివ్వెంల, పెన్ పహాడ్ మండలాల్లో 22 చెరువులు ఉన్నాయి. కాలువలకు నీటిని విడుదల చేసి నట్లయితే చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండుతాయి. కుడి, ఎడమ కాల్వల కు నీటిని విడుదల చేస్తే ఆయకట్టు పరిధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 30వేల ఎకరాల భూము లు సాగులోకి రానున్నాయి. ప్రాజెక్టు మీద ఇరువైపులా నిర్మించిన రక్షణ గోడలు శిథిలవస్థకు చేరాయి. రక్షణ గోడలకు మరమ్మత్తులు చేపట్టలేదు. రక్షణ గోడలు శిథిలమైన స్థానంలో కర్రలు కట్టి మమ అనిపించారు. ప్రాజెక్టు కు సందర్శకులు వచ్చినప్పుడు వారు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్న వెదురు కర్రలు విరిగే ప్రమాదం ఉంది. మూసీ ప్రాజెక్టుకు 30 స్కవర్, క్రష్, రెగ్యులేటర్ గేట్లు ఉన్నాయి. వీటిలో 10 స్కవర్ గేట్లను శాశ్వతంగా మూసివేశారు. ఎనిమిది క్రష్ గేట్లలో మూడు గేట్ల నుండి నీరు లీకేజీ రూపంలో వాగులోకి వెళ్తుంది. దశాబ్దన్నర కాలంగా గేట్ల నుంచి నీరు లీకేజి అవుతున్న మరమ్మతులకు నోచుకోలేదు. మూసీ ప్రాజెక్టు డ్యాం గేట్లు ముగిసిన తర్వాత ఉన్న ప్రాంతంలో డ్యాం గోడల నుంచి సైతం నీరు లీకేజీల రూపంలో ప్రవహిస్తుంది. ఈ లీకేజీలు సంవత్సరాల తరబడి అవుతున్న పట్టించుకోవడం లేదు. లీకేజీల వెంబడి చెట్లు పెరిగి ఆ గోడను మరింత బలహీన పరుస్తున్న పరిస్థితి ఉంది.గతంలో పర్యాటకులు, అతిధులతో కలకలలాడిన అతిథి గృహం నేడు వెలవెలబోతుంది. అతిథి గృహానికి మరమ్మత్తులు లేక శిధిలవస్థకు చేరుతుంది. అతిథి గృహం, గేట్లకు కలర్స్, ఇతర మరమ్మతుల కోసం రూ.4 కోట్ల తో ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు చెబుతున్నారు.

డ్యాం రక్షణ, మరమ్మతుల కోసం రూ. 75 లక్షలతో ప్రభుత్వం నుండి సాంక్షన్ ఆర్డర్స్ వచ్చాయి కానీ సాంక్షన్ ఆర్డర్స్ వచ్చిన టెండర్లకు ఎవరు ముందుకు రాలేదని త్వరలో మళ్లీ టెండర్ వేసి మరమ్మతులు చేపడతామని ప్రాజెక్టు డి ఈ చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలో రెండో ప్రాజెక్ట్ అయిన మూసి ప్రాజెక్టును పర్యటకేంద్రంగా అభివృద్ధి చేయడానికి అన్ని వసతులు ఉన్నాయి.

ఆహ్లాదకర వాతావరణం, పర్యాటకుల సందడి, హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి, చుట్టుపక్కల ప్రకృతి అందాలు పర్యాటక కేంద్ర అభివృద్ధికి కావలసిన అన్ని అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వం స్పందించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# బంగాళాఖాతంలో తుఫాను..

# తెలంగాణలో ప్రభావం ఎందుకు..

హైదరాబాద్, అక్టోబరు 31, మొంథా తుఫాను ఏపీలో ఏర్పడింది. తీరం కూడా అక్కడే దాటింది. వాస్తవానికి ఈశాన్య రుతుపవనాలు సమీపించిన వేళ ఈ తుఫాను ఒకరకంగా ఏపీలో భారీ వర్షాలను కురిపించింది అని చెప్పుకోవాలి. అయితే అక్కడి అధికారులు కోస్తా ఆంధ్ర ప్రాంతంలో వర్షాలు విపరీతంగా కురుస్తాయని అనుకున్నారు. కానీ అధికారుల అంచనాలు కూడా తప్పి నెల్లూరు, ప్రకాశం, రాయలసీమ జిల్లాలలో కుంభవృష్టి కురిసింది. మొంథా తుఫాను చివరికి తెలంగాణపై కూడా తన ప్రతాపాన్ని చూపింది. ఉమ్మడి వరంగల్, ఉమ్మడి మెదక్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలలో బీభత్సంగా వర్షాలను కురిపించింది. వాస్తవానికి ఈ తుఫాను తెలంగాణ రాష్ట్రంలో ఇంతటి విపత్తుకు కారణమవుతుందని ఎవరూ ఊహించలేదు.మొంథా తుఫాను గమనాన్ని అంచనా వేసిన వాతావరణ నిపుణులు సైతం ఆశ్చర్యపోతున్నారు. ఈ తుఫాను గమనం, వేగం, లక్షణాలు వేరుగా ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. వాస్తవానికి తుఫాన్ తీరం దాటిన తర్వాత కొద్ది గంటల వరకు పరిసర ప్రాంతాల్లో గాలులు విపరీతంగా వీస్తాయి. వర్షాలు కూడా అతి భారీగా కురుస్తాయి. ఈ తుఫాను అంతర్వేదిలో తీరం దాటిన తర్వాత అక్కడ ఎటువంటి ప్రభావం కనిపించలేదు.. ఏపీలోని జంగారెడ్డిగూడెంలో భారీగా వర్షం కురిసింది..ఏలూరు, కోనసీమ, పశ్చిమగోదావరి ప్రాంతాలలో ఊహించిన స్థాయిలో వర్షం కురువలేదు. ఒక అంచనా ప్రకారం ఎక్కడ కూడా 50 మిల్లీమీటర్ల వర్షపాతానికి మించి నమోదు కాలేదు. వాతావరణ నిపుణులు చెబుతున్న దాని ప్రకారం తుఫాను “ఐ” ప్రాంతంలో 50 కిలోమీటర్ల దూరంలో క్లౌడ్ వాల్స్ ఏర్పడతాయి. క్లౌడ్ వాల్స్ వల్ల పరిసర ప్రాంతాల్లో విపరీతంగా గాలులు, అతి భారీ వర్షాలు కురుస్తాయి.తుఫాన్ తీరం దాటిన తర్వాత అంతర్వేది ప్రాంతానికి దాదాపు 330 కిలోమీటర్ల దూరంలో ఉన్న కావలి వద్ద అత్యధికంగా వర్షాలు కురిపించే మేఘాలు ఏర్పడ్డాయి. దీంతో ఆ ప్రాంతంలో 20 సెంటీమీటర్లకు మించి వర్షపాతం నమోదయింది. వాస్తవానికి తుఫాన్ ఏర్పడిన తర్వాత దానికి కుడి వైపు ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తాయి. ఈదురు గాలులు వీస్తాయి. అయితే అంతర్వేదికి కుడివైపున కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలు ఉన్నాయి. ఈ ప్రాంతాలలో భారీ వర్షాలు కురవలేదు. అయితే విశాఖపట్నంలో ద్రోణి ప్రభావం వల్ల భారీగా వర్షం కురిసింది.మొంథా తుఫాను సముద్రంలో బాధపడినప్పటి నుంచి గంటకు 15 నుంచి 17 కిలోమీటర్ల వేగంతో ముందుకు కదిలింది. అందువల్లే ఎక్కువ ప్రభావం చూపించలేకపోయింది. దీనికి తోడు తక్కువ సమయంలోనే గాలుల వేగంలో మార్పు వచ్చింది. తుఫాను తీరం దాటిన తర్వాత మేఘాలు అనూహ్యంగా ముందుకు కదిలాయి. ఆ తర్వాత తెలంగాణలోని ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, మెదక్ ప్రాంతాలలో స్థిరపడిపోయి.. కుంభవృష్టి కురిపించాయి. దీంతో ఈ ప్రాంతాలలో 21 నుంచి సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. వాస్తవానికి అక్టోబర్ చివరి వారంలో ఈ స్థాయిలో వర్షాలు కురవడం దాదాపు అరుదు. రాష్ట్రంలో ఈ ఏడాది అంతగా వర్షాలు కురవలేదు. పంటలు చేతికి వచ్చే సమయంలో కురిసిన వర్షాల వల్ల నష్టం తీవ్రంగా ఉంది.. చేతికి వచ్చిన పంటలు నీటిపాలయ్యాయి. దీంతో రైతులకు కన్నీళ్లే మిగిలాయి.

# ఆ ఐదు జిల్లాల్లో ముందుగా వరికొనుగోళ్లు

ఖమ్మం, అక్టోబరు 31,మొంథా తుఫాను ప్రభావంతో ఉత్పన్నమైన పరిస్థితులపై సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ధాన్యం సేకరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని.. నష్టపోయిన జిల్లాల్లో ముందుగా కొనుగోళ్లు ప్రారంభించాలని చెప్పారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి మండల స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించాలని ఆదేశించారు. అధికారుల సెలవులను రద్దు చేసి.. క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, 24 గంటల పరిస్థితిపై నివేదికలు సమర్పించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు.తుఫాను ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న అత్యవసర పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత అప్రమత్తత ప్రకటించింది. గురువారం నాడు మంత్రులు.. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు , ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ముఖ్యమంత్రి, రైతులకు నష్టం జరగకుండా ఉండేందుకు తక్షణమే చేపట్టాల్సిన సహాయక చర్యలు, ధాన్యం సేకరణ ప్రక్రియపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వర్షాల కారణంగా వరి కోతల కాలంలో అనుకోకుండా ఏర్పడిన ఈ ఘటపై సీఎం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ప్రతి గింజనూ కాపాడటం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని చెప్పారు.తుఫాను ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ముందుగా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ములుగు, వరంగల్, హన్మకొండ లాంటి జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి మండల స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించి.. వారికి పూర్తి బాధ్యతలు అప్పగించాలని ఆదేశాలు జారీ చేశారు. అధికారులు ఎవరైనా సెలవులను రద్దు చేసుకొని క్షేత్రస్థాయిలో పర్యటించాలని.. నిబంధనలు పాటించడంలో నిర్లక్ష్యం వహిస్తే తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హెచ్చరించారు.ప్రతి కొనుగోలు కేంద్రం నుంచి ప్రతి 24 గంటలకు ఒకసారి రోజువారీ నివేదికలను కలెక్టర్లకు అందించాలని, పౌర సరఫరాల విభాగం నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా చూసేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని, అధికారుల మధ్య సమన్వయాన్ని పెంచాలని సీఎం ఆదేశించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలు సంయుక్తంగా ఒక 24 గంటల మానిటరింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రులు ప్రజలకు అందుబాటులో ఉండేలా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలని ఆదేశించారు.చెరువులు, వాగులు, మేజర్, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, లోలెవల్ కల్వర్టుల వద్ద నీటి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. స్థానికులను అప్రమత్తం చేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్ల వద్ద ట్రాఫిక్‌ను మళ్లించాలని, అవసరమైతే ధాన్యాన్ని సమీపంలోని ఫంక్షన్ హాళ్లు లేదా ఇతర సురక్షిత ప్రదేశాలకు తరలించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు.

# జనవరి నుంచి అందుబాటులోకి టిమ్స్

హైదరాబాద్, అక్టోబరు 31, రాష్ట్ర ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఫ్రీగా అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ నగరంతో పాటు వరంగల్ జిల్లాలో చెరొకటి చొప్పున రెండు భారీ ఆస్పత్రుల నిర్మాణం చేపట్టిన సంగతి తెలిసిందే. అవే టిమ్స్. సనత్ నగర్‌లో సుమారు పదుల ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తోన్న ఈ ఆస్పత్రి డిసెంబర్ చివరి నాటికి అందుబాటులోకి రానుంది. ఇప్పటికే దీని నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మరి ఈ ఆస్పత్రిలోని ప్రత్యేకతలు, వీటికి కేటాయించిన బడ్జెట్ వంటి వివరాలు..తెలంగాణ రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి వారు తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తే వైద్య సేవల కోసం గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల మీదనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. దీంతో ఈ రెండు ఆస్పత్రుల మీద భారం అధికం అయ్యింది. పైగా పెరుగుతున్న జనాభా అవసరాలకు తగ్గట్టుగా ఇవి సరిపోవు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం మరి కొన్ని ప్రాంతాల్లో భారీ స్థాయిలో ప్రభుత్వ ఆస్పత్రుల నిర్మాణం చేపట్టాలని భావించింది. దీనిలో భాగంగా వరంగల్ , హైదరాబాద్ నగరంలోని సనత్ నగర ప్రాంతాల్లో తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(టిమ్స్) పేరిట ప్రభుత్వ ఆస్పత్రుల నిర్మాణం ప్రారంభించింది. వీటిల్లో పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించనున్నారు. ఈక్రమంలో ఈ రెండు ఆస్పత్రులకు సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది.సనత్‌నగర్‌లో నిర్మిస్తోన్న టిమ్స్ ఆసుపత్రి ఈ సంవత్సరంలోనే అందుబాటులోకి రానుంది. కార్పొరేట్ హంగులతో ఈ ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్న నేపథ్యంలో డిసెంబర్ 9న ఈ ఆస్పత్రిని ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆలోపు సాధ్యం కాకపోతే.. డిసెంబర్ 31 నాటికి దీన్ని అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. దీంతో ఈ ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సుమారు 58 ఎకరాల విస్తీర్ణంలో.. రూ.1,100 కోట్ల ఖర్చుతో.. 11.68 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో.. జీ+5 అంతస్తుల భవన సముదాయంగా సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణం సాగుతోంది. దీనిలో 1000 పడకలు, 30 విభాగాల్లో పేదలకు కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందించనున్నారు.ఈ సంవత్సరం డిసెంబర్ 31 కల్లా వరంగల్ నిర్మిస్తోన్న టిమ్స్ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం బలంగా నిర్ణయించుకుంది. ఆ మేరకు నిర్మాణ పనులు వేగవంతం చేసింది. ఈ రెండు ఆస్పత్రులు ప్రారంభించిన తర్వాత.. వచ్చే సంవత్సరం అనగా 2026, మార్చిలో.. అల్వాల్, అలానే జూన్‌లో.. ఎల్బీనగర్, వచ్చే ఏడాది డిసెంబర్‌లో.. నిమ్స్ హాస్పిటల్ బిల్డింగ్ పనులు పూర్తి చేయాలని తెలంగాణ సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఆస్పత్రులు ప్రారంభమైతే రాష్ట్ర ప్రజలకు ప్రపంచస్థాయి వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. నిరుపేద కుటుంబాలు ఫ్రీగా కార్పొరేట్ వైద్యం పొందుతాయిసనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రిలో ముఖ్యంగా గుండె జబ్బులకు అత్యాధునిక సర్జరీ సేవలు అందించనున్నారు. మొత్తం ఆస్పత్రిలోని బెడ్స్‌లో 500 పడకలను గుండె వ్యాధుల రోగులకు కేటాయించనున్నారు. ఈ ఆస్పత్రిలో ఆధునాతన ఆపరేషన్ థియేటర్స్, క్యాథ్‌ల్యాబ్‌లు అందుబాటులోకి రానున్నాయి. అలానే ఈ ఆస్పత్రిలో అవయవ మార్పిడికి చికిత్స కోసం.. నిపుణులైన వైద్యులను కేటాయించడమే కాక.. అంతర్జాతీయ ప్రమాణాలతో ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ఈ ఆస్పత్రిలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ ఫర్ కార్డియాక్ డిసీజెస్ అండ్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగాన్ని ప్రారంభించనున్నారు. వీటితో పాటు ప్రసూతి, న్యూరాలజీ, ఈఎన్‌టీ, పల్మనరీ, పీడియాట్రిక్ ఇతర విభాగాల్లోనూ ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

# టెండర్లు లేకుండానే పనులు

మెదక్, అక్టోబరు 31, అన్ని విషయాలు అధికారులకు తెలిసిన అక్కడ ఏమి జరగట్లేదు అంత నిజాయితీగానే జరుగుతుంది అన్నట్టు వ్యవహరి స్తున్నారు. చిన్న కరెంటు మీటర్ నుంచి విద్యుత్ కనెక్షన్ కావాలనుకున్న నిబంధనల కంటే ఎక్కువ మామూళ్ళు ముట్ట చెప్పాల్సిం దే. ట్రాన్స్ఫార్మర్, ప్రభుత్వ కార్యాలయాలు, అనధికార వెంచర్లు.రైస్ మిల్లులు విషయానికి వస్తే ఈ అంచనాలు అంకెలు అధికారు లు కాంట్రాక్టర్లు కలిసి ఎంత చెబితే గంతే అంటున్నారు విద్యుత్ వినియోగదారులను నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం అటువైపు చూడడమే మానేసింది.ఈ అంశాలను పూర్తిస్థాయిలో పరిగణనలోకి తీసుకుం టూ జిల్లాలో కాంట్రాక్టర్ లతో అధికారుల కుమ్మక్కుఅనే శీర్షిక గురువారం నాడు వెలువడింది పాఠకులకు తెలిసిందే ముఖ్యంగా విద్యుత్ అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మ క్కు సంఘటన లో భాగంగానే ప్రధానంగా జిల్లా కేంద్రంలో డిఈ కనుసన్నల్లో పనులు కాంట్రాక్టర్ల దగ్గర పర్సెంటేజి తీసుకొని పనులు అప్పచెప్పి సొమ్ముచేసు కుంటున్నట్లు కొంత మంది సహచర కాంట్రాక్టర్ లు చెబుతున్న మాట .కాంట్రాక్టర్ లతో దావత్ పేరిట విందులు, వినోదాల తో పాటు కమీషన్ తీసుకొని ప నులు చేస్తున్నారని ఆరోపణలు బలంగా ఉన్నాయి. ముఖ్యంగా పేట జిల్లా కేంద్రంలో చేనేత భవనానికి ఎలాంటి టెండర్లు స్వీకరించకుండానే కమిషన్ తీసుకొని ఒకే కుటుం బానికి చెందిన ముగ్గురు అన్నదమ్ముల్లో ఒక్కరికే పనులు అప్పగించడం వెనుక ఉన్న అంతరిమేమిటో అధికారులు చెప్పాలి . ఇదిలా ఉండగా మద్దూరు, కోస్గి మండలాలకు చెందిన కాంట్రాక్టర్లుకు పనులు అప్పచె ప్పటం పరిపాటిగా మారింది. ఏది ఏమైనా సరే నాకు మామూళ్ళు వస్తున్నాయా..? లేదా?అన్నది ఆయనకు ఆయనే పొరపాటుగా మారినట్లు తెలుస్తుంది. మక్తల్ నియోజకవర్గంలో విద్యుత్ పనుల విషయంలో సంబంధిత అధికారులపై ఓ హైదరాబాద్ కాంట్రాక్టర్ ఆర్టీఐ కింద సమాచారం ఇవ్వమని దరఖాస్తు చేయగా సమాచారం ఇవ్వకపోగా ఆ విషయమై డి ఇ స్వయంగా తన వాహనంలో సంబంధిత ఏఈ లు, ఏ డి లను వెంట తీసుకుని వెళ్లి ఆ కాంట్రాక్టర్ తో పరిష్కారం చేసుకొన్నట్లు బహిరంగంగా ఇతర కాంట్రాక్టర్ లు చర్చించుకుంటున్నారు.మరి ఇంత బహిరంగంగా ప్రభుత్వానికి ఆదాయం రాకుండా అటువంటి వినియోగదారులకు మాత్రం చుక్కలు చూపిస్తున్నారు. కాసులు కురిపిస్తున్న అనధికార వెంచర్లు ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ శాఖ అధికారి తన జేబుల్లోకి వేసుకొంటుంటే మరి జిల్లా కేంద్రంలో ఉన్న జిల్లా సూపరింటెండెంట్ అధికారికి తెలియకుండా పనులు ఎలా చేస్తారని మిగతా కాంట్రాక్టర్లు చర్చించుకుంటున్నారుఏది ఏమైనా ఇంతవిద్యుత్ శాఖలో ఇన్ని అక్రమాలు చోటు చేసుకుంటుంటే చోద్యం చూస్తున్నారా అని విమర్శ లు సైతం ఉన్నాయి. విద్యుత్ వినియోగదారులు ఏమైపోయినా పర్వాలేదు సంబంధిత అధికారులు మాత్రం కాంట్రాక్టర్లు బాగుపడితే చాలు అన్నట్టుఉంది .నారాయణపేట జిల్లాలో విద్యుత్ అధికారుల తీరు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది. ఈ అంశంపై వినియోగదారులు సైతం తీవ్ర నిరాశకు గురి అవు తున్నప్పటికీ వారిని ఓదార్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికార యంత్రాం గం నియమ నిబంధనలను అమలు చేస్తూ అడుగులు వేయవలసిన అవసరం ఎంతైనా ఉందని వినియోగదారులు చెబుతున్న మాట. కాంట్రాక్టర్ల కు ఎవరికి ఏ రకమైనటువంటి పని కావలసి ఉన్న ఆ పనికి సంబం ధించి టెండర్ వేయవలసి ఉంటుంది. ఈ శాఖలో ఆ నిబంధనలు ఏం చెల్లవు. పోస్టల్ డిపార్ట్మెంట్ పోస్టులో డీటెయిల్ రాకుండా అన్ని అక్కడే కార్యాలయంలో కార్యక్రమం అంతా పూర్తి చేసినప్పటికీ అక్కడే పోస్టల్ నుంచి వచ్చినట్టు టెండర్లు తీస్తారు నచ్చిన వారికి ఇస్తారు.. అంతా ఒక పద్ధతి ప్రకారం జరుగుతుంది ఇక్కడ ఎవరికి ఏ పని కావాలో ఉన్నత అధికారులు మాత్రమే నిర్ణయిస్తారు. ప్రజాప్రతినిధులు సైతం ఇందుకు మద్దతు పలుకుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఈ విధానానికి ఇచ్చేవరకు నియమ నిబంధనలకు స్వాగతం పలకాలని కాంట్రాక్టర్లతోపాటు వినియోగదారులు ఆసక్తి కనపరుచుతున్నారు. ఇంత బహిరంగంగా ప్రభుత్వానికి ఆదాయం రాకుండా పనులు చేస్తుంటే విజిలెన్స్ అధికారులు నిద్ర పోతున్నారా అనే విమర్శలు సైతం ఉన్నాయి ఇకనైనా అనధికార టెండర్ల పనులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ఆయేషా మీరా తల్లిదండ్రుల పిటిషన్పై విజయవాడ సీబీఐ కోర్టు విచారణ

విజయవాడ ఆయేషా మీరా తల్లిదండ్రుల పిటిషన్పై విజయవాడ సీబీఐ కోర్టులో విచారణ జరిగింది. సీబీఐ పునర్విచారణ నివేదిక కాపీలను అప్పగించాలని కోరుతూ ఆయేషా మీరా తల్లిదండ్రులు పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. నివేదిక కాపీలను పిటిషనర్లకు అందజేస్తామని సీబీఐ కోర్టుకు తెలిపింది. నివేదిక పరిశీలించాక అభ్యంతరాలు చెబుతామని ఆయేషా మీరా తల్లిదండ్రులు వెల్లడించారు. దీంతో కేసు తదుపరి విచారణ నవంబర్ 21కి విజయవాడ సీబీఐ కోర్టు వాయిదా వేసింది.

# 2 గంటలకు 11 కోట్లు

హైదరాబాద్, అక్టోబరు 31, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ఒక్క సలహా కోసం రూ.11 కోట్లు డిమాండ్ చేసిన ఘటన చర్చనీయాంశమైంది. హైదరాబాద్‌కు చెందిన ఓ ఇంజనీరింగ్ కంపెనీ కొత్త ప్రొడక్ట్ మార్కెటింగ్ కోసం ఆయన సలహా కోరగా.. కేవలం రెండు గంటల కన్సల్టేషన్ కోసం ఈ భారీ మొత్తం అడిగినట్లు సమాచారం.

2019లో వైఎస్సార్‌సీపీకి వ్యూహకర్తగా పనిచేసి తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన ప్రశాంత్ కిషోర్, ప్రస్తుతం రాజకీయాలతో పాటు వ్యాపార, సలహా రంగాల్లోనూ కొనసాగుతున్నారు. అయితే ఈ ఫీజు వివరాలు బయటకు రావడంతో సోషల్ మీడియాలో విస్తృత చర్చ జరుగుతోంది.ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తన వృత్తిపరమైన సేవలకు తీసుకునే భారీ ఫీజు గురించి చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా మారాయి. కేవలం ఒక్క సలహా కోసం ఆయన ఏకంగా రూ. 11 కోట్లు డిమాండ్ చేశారని.. ఆ మొత్తాన్ని ఫీజుగా తీసుకున్నానని ఆయన ఇటీవల స్వయంగా వెల్లడించారు. ప్రశాంత్ కిషోర్ ఈ సలహా సేవలను హైదరాబాద్‌కు చెందిన నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్‌కు అందించినట్లు తెలుస్తోంది.నవయుగ కంపెనీ తమ నూతన ఉత్పత్తిని మార్కెట్‌లోకి విడుదల చేసేందుకు అవసరమైన వ్యూహాలు, సలహా కోసం ప్రశాంత్ కిషోర్ నుంచి కన్సల్టేషన్ కోరింది. వారి ఉత్పత్తిపై ఆలోచనలు పంచుకోవడం, మార్కెటింగ్ టిప్స్, వ్యూహాత్మక సలహా అందించడానికి ప్రశాంత్ కిషోర్ కేవలం రెండు గంటల సమయాన్ని వెచ్చించినందుకు గాను ఈ భారీ మొత్తాన్ని ఫీజుగా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇది ఆయన వ్యూహకర్తగా వ్యక్తిగత బ్రాండ్‌కు ఉన్న అపారమైన విలువను స్పష్టం చేస్తుంది.ప్రశాంత్ కిషోర్ ప్రస్తుతం బిహార్ రాజకీయాల్లో జన్ సురాజ్ పార్టీని స్థాపించి చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నారు. తన రాజకీయ కార్యక్రమాలకు నిధులు ఎక్కడ నుంచి వస్తున్నాయని ప్రతిపక్షాలు ప్రశ్నించిన నేపథ్యంలో ఆయన ఈ ఆదాయ వివరాలను ఇటీవల బయటపెట్టారు. తాను అందుకున్న ఫీజుపై జీఎస్టీ , ఆదాయ పన్ను సక్రమంగా చెల్లించి, మిగిలిన మొత్తాన్ని తన పార్టీకి విరాళంగా ఇచ్చానని ఆయన ధైర్యంగా ప్రకటించారు. డొల్ల కంపెనీల నుంచి నిధులు వస్తున్నాయనే ఆరోపణలను ఆయన బలంగా తిప్పికొట్టారు.ప్రశాంత్ కిషోర్ గతంలో 2019 ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యూహకర్తగా పనిచేసి.. ఆ పార్టీ ఘన విజయానికి కీలక భూమిక పోషించారు. దీని ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ఆయనకు విశేష ప్రాచుర్యం లభించింది. ప్రశాంత్ కిషోర్ ఈ అసాధారణ సంపాదన కేవలం ఎన్నికల వ్యూహాలకే పరిమితం కాకుండా.. కార్పొరేట్ రంగంలో కూడా ఆయన వ్యూహాత్మక సలహాకు ఉన్న అత్యధిక డిమాండ్‌ను తెలియజేస్తుంది.

# వికారాబాద్ లో రన్ ఫర్ యూనిటీ




వికారాబాద్ సర్ధార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆద్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎన్నెపల్లి చౌరస్తా నుండి ఎన్టీఆర్ చౌరస్తా వరకు నిర్వహించిన "రన్ ఫర్ యూనిటీ" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రతకు సర్ధార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయమని, ఆయన ఆలోచనలు, స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని తెలిపారు."రన్ ఫర్ యూనిటీ" వంటి కార్యక్రమాల ద్వారా జాతీయ ఐక్యత పట్ల ప్రజల్లో చైతన్యం పెంపొందుతుందని పేర్కొన్నారు.యావత్ భారతావనిలోని ప్రజలందరూ ఒకే కుటుంబ సభ్యులుగా భావించి,జాతి ఐక్యతకు పునరంకితమై,మాతృదేశ సేవలో తమ వంతు పాత్ర పోషించడం ద్వారానే స్వాతంత్ర్య సమరయోధులకు నిజమైన నివాళి అర్పించినట్టవుతుందని అన్నారు.

జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ భారత దేశపు ఉక్కు మనిషి సర్ధార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని ×'జాతీయ ఐక్యతా దినోత్సవం'×గా జరుపుకోవడం మనందరి అదృష్టం. ఈ 'రన్ ఫర్ యూనిటీ' వంటి కార్యక్రమాలు దేశ ఐక్యత, సమగ్రత సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్తాయి.స్వాతంత్ర్యం తరువాత, సర్దార్ పటేల్ ఎంతో దార్శనికత, సంకల్పంతో సుమారు 565 స్వదేశీ సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి, భారతదేశాన్ని ఏకీకృతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన కృషి వల్లే నేడు మనం సమైక్య భారతాన్ని చూడగలుగుతున్నాం.యువతరం ఆయన ఆశయాలను, దేశ సమగ్రత కోసం ఆయన పడిన తపనను స్ఫూర్తిగా తీసుకోవాలి. దేశాభివృద్ధిలో పాలుపంచుకుంటూ, అన్ని ప్రాంతాల ప్రజలతో సమైక్యత, సోదరభావాన్ని పెంపొందించాలి అని అన్నారు.

ఈ కార్యక్రమం లో జిల్లా ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, డిటిసి డిఎస్పి శ్రీనివాసులు, ఏఆర్ డిఎస్పి వీరేష్, వికారాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ భీమ్ కుమార్, ఆర్ఐ డేవిడ్, ఎస్ఐ లు, ఆర్ఎస్ఐ లు , సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, యువతి యువకులు తదితరులు పాల్గొన్నారు. .

# ఖమ్మంలో దారుణం?..

## సీపీఎం నేత దారుణ హత్య



ఖమ్మం జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. సీపీఎం రైతు సంఘం నేత సామినేని రామారావును గుర్తుతెలియని దుండగులు అత్యంత పాశవికంగా హత్య చేశారు. చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలో శుక్రవారం ఉదయం ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది.

మృతుడు సామినేని రామారావు రోజూ మాదిరిగానే ఉదయం వాకింగ్కు వెళ్లారు. ఆ సమయంలో మార్గమధ్యంలో ఆయన్ను అడ్డగించిన దుండగులు, పదునైన ఆయుధంతో గొంతుకోసి హతమార్చారు. రక్తపు మడుగులో పడివున్న ఆయన్ను గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిసరాలను పరిశీలించి, సాక్ష్యాధారాలను సేకరించే పనిలో పడ్డారు. హత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ఈ హత్య వెనుక రాజకీయ లేదా వ్యక్తిగత కక్షలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో పాతర్లపాడు గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది

# "ఐక్యంగా ఉంటే దృఢంగా ఉంటాము" అనే సందేశాన్ని అందించడమే ఐక్యత దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం

## గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్





స్వాతంత్ర్యం అనంతరం భారత దేశాన్ని సమగ్రంగా, బలంగా నిర్మించడంలో కీలక పాత్ర పోషించిన దేశ తొలి హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ది జయంతి అక్టోబర్ 31 ను భారత ప్రభుత్వం "జాతీయ ఐక్యతా దినోత్సవం గా ప్రకటించి, 2014 అక్టోబర్ 24న అధికారికంగా గుర్తించింది.

ఈ సందర్భంగా శక్రవారం గుంటూరు పోలీస్ పరేడ్ మైదానంలో "ఐక్యత దినోత్సవం ? ఏక్తా దివస్ (ఇనిబిష్ట్రజీ ఆతిలిజీబ)" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఇతర పోలీస్ అధికారులు కలిసి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి, పోలీస్ గౌరవ వందనంతో ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ "భారతదేశ ఐక్యత, సమగ్రత, భద్రత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ గారు చేసిన కృషి అపూర్వమైనది. స్వాతంత్ర్యం అనంతరం దేశవ్యాప్తంగా ఉన్న 565 సంస్థానాలను ఒకే భారతావనిగా విలీనం చేయడం ద్వారా జాతీయ సమైక్యతకు శ్రీకారం చుట్టారు. ఇది ఆయన దూరదృష్టి, దేశప్రేమ, దృఢ సంకల్పానికి నిదర్శనం." అని అన్నారు. "భారతదేశం సమైక్యంగా ఉన్నందునే అనేక యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలు, ప్రకృతి విపత్తులను ధైర్యంగా ఎదుర్కోగలిగింది. సమాజంలో కూడా మనం తారతమ్యాలు లేకుండా ఐక్యంగా ఉంటే ఏ సమస్యనైనా సమష్టిగా ఎదుర్కోవచ్చు. కాబట్టి 'ఐక్యంగా ఉంటే దృఢంగా ఉంటాము' అనే సందేశాన్ని మనం ఆచరణలో పెట్టాలి." అని ఎస్పీ పేర్కొన్నారు. "మనమందరం సర్దార్ వల్లభాయ్ పటేల్ సూచించిన ఐక్యతా సిద్ధాంతాలను ఆచరిస్తూ, భారతదేశ సమగ్రతను కాపాడే దిశగా కృషి చేయాలి." అని అన్నారు.

తరువాత జిల్లా ఏఆర్ డీఎస్పీ ఏడుకొండల రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు మరియు పౌరులకు జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు.

# నష్టపోయిన రైతలను ఆదుకోవాలి

**ఎకరాకు 50 వేలు పరిహారం ఇవ్వాలి**

**మిల్లర్లే డైరెక్ట్ గా ధాన్యం కొనాలి**

**ఎమ్మెల్సీ కవిత**





కరీంనగర్ జిల్లాలో ఎమ్మెల్సీ కవిత శుక్రవారం జు పర్యటించారు. మక్తపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.

కవిత మాట్లాడుతూ మొంథా తుపాను కారణంగా రైతులు దారుణంగా నష్టపోయారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలల తరబడిగా కొనుగోళు చేయటం లేదు. దానికి తోడు వర్షాల కారణంగా రైతు పరిస్థితి దయనీయంగా మారింది. మానవతా దృక్పథంతో ప్రభుత్వం వారిని ఆదుకోవాలి. ఎకరాకు రూ. పదివేలు పరిహారం ఇస్తామంటే ఏ మూలకు సరిపోదని అన్నారు.రైతులకు మేలు జరగాలంటే ఎకరాకు రూ. 50 వేలు పరిహారం ఇవ్వాలి. మొలకెత్తిన, బూజు పట్టిన, తేమ శాతం ఎక్కువ ఉన్న సరే ధాన్యం కొనుగోలు చేయాలి. కరీంనగర్ లోని తిమ్మాపూర్ మండలం మక్తాపల్లి గ్రామంలో ఉన్నాం. ఇక్కడ కొనుగోలు కేంద్రంలో రైతులు ధాన్యాన్ని నెల రోజులుగా ఉంచారు. రాత్రి పడ్డ వానకు ధాన్యమంతా తడిసి ముద్దైంది. ఇప్పటి దాకా వాళ్లు చాట్లతో ఎత్తుకున్న పరిస్థితి. ఇది చాలా దారుణం, బాధాకరం. నెల రోజులుగా ధాన్యం కుప్పలు పోసి ఉంచారు. ఇప్పుడు ప్రకృతి వైపరీత్యం కారణంగా ధాన్యమంతా తడిసి పోయింది. వర్షాల కారణంగా ఇంకా నష్టం వాటిల్లే పరిస్థితి ఉంది. ధాన్యానికి మె?లకలు వస్తున్నాయి. మొత్తం దారుణంగా తడిసి పోయింది. ఇలాంటి సందర్భంలో తేమ శాతం 17 కన్నా తక్కువ ఉండాలని మిల్లర్లు కండిషన్లు పెడుతున్నారు. అది సాధ్యపడదు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించాలని అన్నారు.

ఇప్పటి వరకు అసలు కొనుగోలు కేంద్రాలే ఎందుకు ప్రారంభించలేదని కలెక్టర్ గారిని ప్రశ్నిస్తున్నా. అసలు ఐకేపీ సెంటర్లు లేకుండా డైరెక్ట్ గా ధాన్యం మిల్లర్లే కొనుగోలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఐకేపీ సెంటర్ల నుంచి మిల్లర్ల వద్దకు ధాన్యం తీసుకెళ్లేందుకు రైతులకు అదనంగా ఖర్చు అవుతోంది. తేమ శాతం ఎక్కువ ఉన్న, బూజు పట్టిన, మొలకలు వచ్చిన సరే ధాన్యం కొనుగోలు చేసేలా మిల్లర్లకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలి. భూమి దస్తావేజులు లేవంటూ కౌలు రైతుల ధాన్యం కొంటలేరని చెబుతున్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు రైతులను ఇబ్బంది పెట్టటం సరికాదు. వారి ధాన్యం కొనేలా వెసులుబాటు ఇవ్వండి. అదే విధంగా కొనుగోలు కేంద్రాలు తక్షణమే ప్రారంభించాలని అన్నారు. రైతులకు నష్టం జరగకుండా ఉండాలంటే ఎకరాకు రూ. 50 వేలు నష్టపరిహారం ఇవ్వాలి. లేదంటే రైతుల పరిస్థితి దారుణంగా తయారవుతుంది. ఇప్పటికే బీహార్ లో ఎన్నికల కారణంగా కూలీలు రావటం లేదు. దీంతో రైతులు అదనపు కూలీ చెల్లించాల్సి వస్తుంది. ప్రభుత్వం ఇస్తామన్న బోనస్ ఇవ్వలేదు. పైగా వర్షాలతో పంట నష్టం జరుగుతోంది రైతుకు అన్ని రకాలుగా దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంది. డైరెక్ట్ గా మిల్లర్లే ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

# దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించాడానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలి

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించుటకు ప్రతి ఒక్కరు పాటుపడాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భం గా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్లు డి.వేణు, జె అరుణశ్రీలతో సర్దార్ వల్లభాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లా డుతూ జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని భారత ప్రథమ హోమ్ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి అక్టోబర్ 31న ప్రతి ఏటా నిర్వహించు కుంటున్నామని తెలిపారు. దేశ ప్రజలలో మనమంతా భారతీయుల మనే భావనను సుస్థిరం చేసిన మహనీయుడు అని, సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉక్కు సంకల్పాన్ని భావి తరాలు ఆదర్శంగా తీసుకొని వారి ఆశయ సాధన దిశగా కృషి చేసి దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనం తరం దేశ ఐకమత్యం, సమగ్ర త, భద్రతను కాపాడటానికి స్వయంగా అంకితమ వుతామని, దేశ అంతర్గత భద్రతను పటిష్ట పరచటానికి స్వీయ తోడ్పాటు నందిస్తానని ఉద్యోగులతో జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించా రు. అం తకుముందు జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భం గా ఐటి ప్రాంగణం నుంచి చౌరస్తా వరకు పోలీస్ శాఖ ఆధ్వర్యం లో నిర్వహించిన 2 కిలో మీటర్ల యూనిటీ ఫర్ రన్ ర్యాలీ ను జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య , వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నరసాపురంలో ఎక్తా దివాస్ ర్యాలీ

నరసాపురం పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం లో ఏకతా దివాస్ కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు .విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశ ఐక్యతను చాటుతూ నినాదాలు చేశారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నర్సాపురం ఆర్డీవో దాసిరాజు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఐక్యత సమగ్రత అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో సిఐ యాదగిరి మరియు పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.




# పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



## పత్తి రైతుల ప్రయోజనాలను కాపాడాలని సీసీఐ అధికారులను కోరారు

**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 31 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, దామోదర్ రాజనర్సింహ, మునిపల్లి,మండలం మేలసంగం లోని, కాటన్ మిల్ లో, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ( సీసీఐ ) ఆధ్వర్యంలో, పత్తి కొనుగోలు కేంద్రాన్ని, జిల్లా కలెక్టర్ ప్రావీణ్యతో, కలిసి ప్రారంభించారు, ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ, పత్తి రైతుల ప్రయోజనాలను, దృష్టిలో పెట్టుకొని, (సీసీఐ) ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామన్నారు, రైతులకు కనీస మద్దతు ధర (ఎం ఎస్ పి )ను కల్పించాలని (సీసీఐ) అధికారులను మంత్రి కోరారు, దళారులను నమ్మవద్దని, రైతులకు విజ్ఞప్తి చేశారు, ఈ కొనుగోలు కేంద్రం ద్వారా సదాశివపేట, రాయికోడ్, నారాయణఖేడ్, జోగిపేట, వట్టిపల్లి, మండలాల పత్తి రైతులకు, ప్రయోజనం కలుగుతుంది అన్నారు, పత్తి రైతులు కనీస మద్దతు ధర ( ఎం ఎస్ పి ) కోసం, "కపాస్ కిసాన్" మొబైల్ యాప్ ను, డౌన్లోడ్ చేసుకోవాలని (సీసీఐ) అధికారులు కోరారు, గత వర్షాకాలం (2024-25)లో 3, లక్షల 80,వేల క్వింటాళ్ల పత్తిని, కొనుగోలు చేసి రైతులకు 280, కోట్ల రూపాయలను చెల్లించామని, (సిసిఐ) అధికారులు, మంత్రి దామోదర్ రాజనర్సింహకు వివరించారు, పత్తి రైతుల ప్రయోజనాలను కాపాడాలని, మంత్రి అధికారులను ఆదేశించారు, ఈ సందర్భంగా రైతులకు, జొన్న విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో (సీసీఐ) సీనియర్ కమర్షియల్ ఆఫీసర్ వరుణ్, జిల్లా వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 31 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, దామోదర్ రాజనర్సింహ, మునిపల్లి మండలం, పెద్ద చెల్మెడ కలాన్, గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం( పి ఎ సి ఎస్ ) నాఫెడ్ వారిచే మార్కెఫెడ్ ఆధ్వర్యంలో, సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు, ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని, మార్కెఫేడ్, ఆధ్వర్యంలో సోయాబీన్ రైతు సోదరులకు, వ్యవసాయ శాఖ నిర్ణయించిన, కనీస మద్దతు ధర 5,328, రూపాయలను కల్పించాలనె ప్రధాన లక్ష్యంతో, సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామన్నారు, రైతులు పండించిన ప్రతి గింజను, ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నామన్నారు, అనంతరం, సోయాబీన్ కొనుగోలు కేంద్రం పక్కనే ఉన్న, అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించారు, అంగన్వాడీ కేంద్రంలోని విద్యార్థులతో మాట్లాడారు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు, ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ వినయ్, సీనియర్ నేతలు రామ్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు సతీష్, మాజీ జెడ్పిటిసి అసద్ పటేల్,లు పాల్గొన్నారు.....



# రూ.1,032 కోట్లు ఒకేసారి విడుదలకు డిప్యూటీ సీఎం ఆదేశం

## ఉద్యోగుల బకాయిలు 712 కోట్లు క్లియర్

### ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖ పెండింగ్ బిల్లులు రూ.320 కోట్లు విడుదల

### డిప్యూటీ సీఎం ఆదేశంతో బిల్లులు చెల్లించిన ఆర్థిక శాఖ




ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు, పంచాయతీరాజ్ మరియు ఆర్ అండ్ బి శాఖకు సంబంధించిన పెండింగ్ బిల్లులు అక్టోబర్ మాసానికి సంబంధించి సుమారు 1,031 కోట్ల రూపాయలను ఒకేసారి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశం మేరకు ఆర్థిక శాఖ అధికారులు విడుదల చేశారు. శుక్రవారం ఉదయం ప్రజా భవన్ లో ఆర్థిక శాఖ అధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు.

గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల బకాయిలను దశలవారీగా ప్రతినెలా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు క్లియర్ చేస్తూ వస్తున్నారు. అందులో భాగంగా అక్టోబర్ మాసానికి సంబంధించి ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు 712 కోట్ల రూపాయలను డిప్యూటీ సీఎం ఆదేశం మేరకు ఆర్థిక శాఖ అధికారులు విడుదల చేశారు. అదేవిధంగా 10 లక్షల లోపు పెండింగ్ లో ఉన్న బిల్లులను క్లియర్ చేయాలని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంది.

ఇందులో భాగంగా పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖకు సంబంధించి 46,956 బిల్లుల తాలూకు 320 కోట్ల రూపాయలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశం మేరకు విడుదల అధికారులు చేశారు. రోడ్లు మరియు భవనాల శాఖకు చెందిన రూ.10 లక్షల లోపు విలువగల 3,610 బిల్లుల మొత్తం సుమారు రూ.95 కోట్లను ఆర్థిక శాఖ అధికారులు విడుదల చేశారు. అదేవిధంగా పంచాయతీరాజ్ మరియు గ్రామీణ స్థానిక సంస్థలకు సంబంధించిన 43,364 బిల్లుల మొత్తం 225 కోట్ల రూపాయలను సైతం విడుదల చేశారు.సమీక్ష సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ కె రామకృష్ణ రావు, స్పెషల్ సి ఎస్ జయేష్ రంజన్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానీయ , వివిధ విభాగాల కార్యదర్శులు,

సమాచార పౌర సంబంధాల కమిషనర్ ప్రియాంక, సీనియర్ IAS అధికారులు పాల్గొన్నారు...












హైదరాబాద్: రాజ్ భవన్ లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మహ్మద్ అజారుద్దీన్,అజారుద్దీన్ తో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ,ప్రమాణ స్వీకారం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి అజారుద్దీన్ ,మంత్రి అజారుద్దీన్ కు అభినందనలు తెలిపిన సహచర మంత్రులు, నాయకులు

# ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవం పోషణ మాసం వేడుకలు.

## సర్దార్ పటేల్ ఆలోచనలు అందరికీ ఆదర్శం కావాలి

### జిల్లా కలెక్టర్ రాజార్షి షా




**అక్టోబర్ 31, 2025 ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** జాతీయ ఐక్యత దినోత్సవం, పోషణ మాసం వేడుకలు శుక్రవారం ఆదిలాబాద్‌లో ఘనంగా జరిగాయి. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుండి జిల్లా పరిషత్ హాల్ వరకు నిర్వహించిన ఐక్యత ర్యాలీని జిల్లా కలెక్టర్ రాజార్షి షా ప్రారంభించారు.

విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు "దేశం ఒకటే %-% మనసులు కలవాలి", "పటేల్ మన ప్రేరణ" వంటి నినాదాలతో ఉత్సాహంగా నడిచారు. అనంతరం జిల్లా పరిషత్ హాల్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించి, సర్దార్ వల్లభభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు ఆకట్టుకున్నాయి.




అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, దేశ ఏకీకరణలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ చూపిన దూరదృష్టి, ధైర్యం మనందరికీ ఆదర్శమని, ఆయన విలువలు, ఆలోచనలు ప్రతి భారతీయుడు అనుసరించాలని కోరారు. పటేల్ మార్గంలో నడిస్తేనే ఐక్యమైన భారత్ మరింత బలపడుతుందని తెలిపారు.

పోషణ మాసం ప్రాధాన్యంపై కలెక్టర్ మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణానికి పోషకాహారం ఎంతో అవసరం. పిల్లలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. స్థానికంగా లభించే పప్పులు, ఆకుకూరలు, పండ్లతో వంటకాలు తయారు చేసి తీసుకుంటే ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని తెలిపారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యవంతమవుతుందని, అందుకే అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

అనంతరం కలెక్టర్ పోషణ మాసం, ఎక్తా దివాస్, దశముక్త భారత్ అంశాలపై అధికారులు, అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. పోషణ మాసం పోస్టర్లను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశేష సేవలందించిన అంగన్‌వాడీ సిబ్బందిని ప్రశంసాపత్రాలతో సత్కరించారు.

అనంతరం ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను పరిశీలించిన కలెక్టర్, స్థానిక ఆహార పదార్థాలతో తయారు చేసిన వంటకాలను రుచి చూశారు. "స్వస్థ భారత్ %-% పోషిత భారత్" అనే నినాదంతో రూపొందించిన ఫ్లెక్సీపై సంతకం చేసి కార్యక్రమానికి శుభారంభం చేశారు. సెల్ఫీ పాయింట్ వద్ద అధికారులతో కలిసి కలెక్టర్ ఫోటోలు దిగారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సోమ రాజేశ్వర్, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి మిల్క, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

# యువత నైపుణ్యాభివృద్ధికి "బోస్ ఫెలోషిప్" ప్రారంభం:

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**అక్టోబర్ 31, 2025 ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** యువత సమాజంలో సానుకూల మార్పు సృష్టించాలంటే విద్యతో పాటు నైపుణ్యాలు, సృజనాత్మకత కూడా అవసరమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. యువత తమ ప్రతిభను ప్రదర్శించి, సామాజిక అభివృద్ధికి దోహదపడాలని ఆయన పిలుపునిచ్చారు.

శుక్రవారం జిల్లా కేంద్రంలోని సాంకేతిక శిక్షణ, అభివృద్ధి సంస్థ (%ఋణజ%)లో, "బోస్ ఫెలోషిప్" సామాజిక సంస్థ భారత్ దేకో ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంలో ఆయన, సమాజంలో స్థిరమైన మార్పు రావాలంటే విద్యతో పాటు సమర్థవంతమైన నైపుణ్యాలు కూడా అవసరమని ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ ఫెలోషిప్ యువతకు సృజనాత్మక ఆలోచనలకు ప్రేరణనిస్తుందని కలెక్టర్ తెలిపారు. వాలంటీర్లు స్థానిక పాఠశాలల్లో విద్యార్థులకు బోధన అందించనున్నారని, ఐదు రోజుల వర్క్‌షాప్‌లో పాల్గొన్న 75 మంది వాలంటీర్లను కలెక్టర్ అభినందించారు. ఆదిలాబాద్ జిల్లాలోని భిన్న భాషా, గిరిజన ప్రాంతాల ప్రత్యేకతను దృష్టిలో ఉంచుకుని భాషా నైపుణ్యాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఫెలోషిప్ ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యం, సమాజ సేవా భావం వంటి అంశాలపై ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం వర్క్‌షాప్‌లో పాల్గొన్న వాలంటీర్లు తమ అనుభవాలను పంచుకున్నారు. అలాగే కలెక్టర్ వాలంటీర్లకు "బోస్ ఫెలోషిప్ కిట్స్"ను అందజేశారు. ఈ కార్యక్రమంలో భారత్ దేకో ప్రతినిధులు అనుశ్రీ, గిరికుమార్, అనూష, విశాల, శివాని, అంజలి, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రైతుకు అండగా నిలిచిన పౌరసరఫరాల సంస్థ...



24 గంటల్లో ధాన్యం కొనుగోలు చేసి చెల్లింపులు జరిపిన సంస్థ

వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని గురువారం నాడు హుస్నాబాద్ మార్కెట్ యార్డులో జిల్లా కలెక్టర్ కు మొరపెట్టుకున్న మహిళ ..

తక్షణమే స్పందించిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

కమిషనర్ గారి ఆదేశాల మేరకు ధాన్యాన్ని కొనుగోలు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్ర నిర్వాహకులు.

106.80 క్వింటాళ్ల ధాన్యానికి గాను 2లక్షల 55 వేల రూపాయలను చెల్లించిన పౌరసరఫరాల సంస్థ

సంతోషం వ్యక్తం చేసిన రైతు కుటుంబం

# నిర్మల్ ఉత్సవాల నిర్వహణకు అధికారులు సన్నద్ధం కావాలి:

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.




**అక్టోబర్ 31, 2025- నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:** నిర్మల్ ఉత్సవాల నిర్వహణకు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లోని తన చాంబర్ లో నిర్మల్ ఉత్సవాల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నడూ లేని విధంగా గత సంవత్సరం నిర్మల్ ఉత్సవాల పేరిట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందామని అన్నారు. నిర్మల్ జిల్లా చరిత్ర, సాంస్కృతిక వారసత్వాన్ని నిర్మల్ ఉత్సవాల వేదిక ద్వారా ఆవిష్కరించామని, ఈ సంవత్సరం కూడా రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి నిర్మల్ ఉత్సవాలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వహణకు సంబంధించి ఎన్టీఆర్ మినీ స్టేడియాన్ని సిద్ధం చేయాలన్నారు. సుందరీకరణ పనులు చేపట్టి, మరుగుదొడ్లు, పెయింటింగ్స్, లైటింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. పార్కింగ్ కొరకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని సూచించారు. జిల్లాలోని పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ సామాజిక మాధ్యమాలలో గుర్తింపు పొందిన జిల్లాకు చెందిన ప్రముఖులతో నిర్మల్ ఉత్సవాల కార్యక్రమ ప్రచారానికి సంబంధించి వీడియోలను రూపొందించాలని వివరించారు. జిల్లా ప్రజల నుంచి నిర్మల్ ఉత్సవాల కార్యక్రమం నిర్వహణ గురించి ఆలోచనలు, అభిప్రాయాలు ఆహ్వానించాలని సూచించారు. సంబంధిత అధికారులంతా సమన్వయంతో పనిచేసి నిర్మల్ ఉత్సవాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డిఓ రత్నకళ్యాణి, డిఈఓ భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, తహసిల్దార్ రాజు, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# "రన్ ఫర్ యూనిటీ" కార్యక్రమం విజయవంతం.



**రాజన్న సిరిసిల్ల జిల్లా , అక్టోబర్ 31 (ప్రజాబలం ప్రతినిధి)** సర్ధార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా నుండి బతుకమ్మ ఘాట్ వరకు నిర్వహించిన "రన్ ఫర్ యూనిటీ" కార్యక్రమంలో విద్యార్థులు,యువత పోలీస్ అధికారులు, సిబ్బందితో కలసి జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఐపిఎస్., పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఁదేశ ఐక్యత, సమగ్రతకు సర్ధార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయమని, ఆయన ఆలోచనలు, స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని తెలిపారు. "రన్ ఫర్ యూనిటీ" వంటి కార్యక్రమాల ద్వారా జాతీయ ఐక్యత పట్ల ప్రజల్లో చైతన్యం పెంపొందుతుందని ఎస్పీ పేర్కొన్నారు. యావత్ భారతావనిలోని ప్రజలందరూ ఒకే కుటుంబ సభ్యులుగా భావించి,జాతి ఐక్యతకు పునరంకితమై,మాతృదేశ సేవలో తమ వంతు పాత్ర పోషించడం ద్వారానే స్వాతంత్ర్య సమరయోధులకు నిజమైన నివాళి అర్పించినట్టవుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ





చంద్రయ్య,బెటాలియన్ కమాండెంట్ సురేష్,సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి,అసిస్టెంట్ కమాండెంట్ లు రాందాస్ , ఎస్. సురేష్ ఇన్స్పెక్టర్ లు కృష్ణ, నాగేశ్వరరావు, ఆర్.ఐ లు మధుకర్, రమేష్, యాదగిరి, ఎస్.ఐ లు,కిరణ్ కుమార్, శ్రీకాంత్, శ్రావణ్ యాదవ్, సాయి, శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, బెటాలియన్ సిబ్బంది, విద్యార్థులు, యువత క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఎన్కతలకు ఆదివారం బజరంగ్దళ్ రాష్ట్ర అధ్యక్షులు శివరామకృష్ణ రాక

## రుద్ర మైసమ్మ ఆలయాన్ని రక్షించుకుందాం

## ఎన్కతల గ్రామ ప్రజల భక్తులకు అండగా నిలుద్దాం



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 31 ( ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మోమిన్ పెట్,మండల పరిధిలోని ఎన్కతల గ్రామంలో ఇండస్ట్రియల్ పార్కు కోసము, ప్రభుత్వము రైతుల భూములను స్వాధీనం చేసుకుని,అక్కడ రోడ్లు వేసే కార్యక్రమాన్ని చేపట్టింది. ఆమైసమ్మ ఆలయ ప్రాంతంలోని మాదిగోని గుట్టగా ప్రసిద్ధి చెందిన గుట్ట పైన ఉన్న రుద్ర మైసమ్మ,ఆలయమును గత మూడు వందల సంవత్సరాల నుండి రైతులందరూ పంటలు వేసే ముందు పంట పండిన తర్వాత, అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటూ అమ్మవారి అనుగ్రహం పైన భక్తి విశ్వాసాలని కలిగి ఆలయంలో పూజలు చేస్తూ వస్తున్నారు. అయితే ఇండస్ట్రియల్ కార్పొరేషన్ అధికారులు నూతనంగా ఏర్పాటు చేస్తున్న రోడ్డు నిర్మాణం సంబంధించిన డ్రాయింగ్స్,ను వేసేటప్పుడు అక్కడ ఆలయం ఉందని తెలిసి కూడా సరిగ్గా ఆలయం మీదుగా రోడ్డును నిర్మించే ప్రయత్నం చేస్తున్నారు. రోడ్డు పక్కకు వేసే అవకాశం ఉన్నా కూడా ఇలా చేయడం శోచనీయం. ఇది హిందువులను టార్గెట్ చేసి ఆలయ ఆనవాలు లేకుండా చేస్తున్న పనిగా అర్థమవుతుంది. ఇండస్ట్రియల్ పార్కుకు భూమిని స్వాధీనం చేసేటప్పుడు,రైతులందరూ అడ్డుపడి తమకు ఆలయానికి ఐదు ఎకరాల పొలం కేటాయించాలని డిమాండ్ చేస్తే,ఆసమావేశానికి వచ్చిన రాష్ట్ర మంత్రివర్యులు శ్రీధర్ బాబు, మరియు రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్, ఆలయానికి భూమి కేటాయిస్తాము అని హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు ఆలయానికి భూమి కేటాయించలేదు. అంతేకాకుండా ఉన్న ఆలయంను జెసిబిలతో తొలగించి వేసి, అక్కడ రోడ్డు వేయాలని రెండు రోజుల కింద జెసిబిలను మోహరించడం జరిగింది. ఆ విషయం తెలిసి మాదిగ గుట్ట పైన పూజలు చేసే దళిత సామాజిక వర్గానికి చెందిన భక్తులు మరియు వివిధ బీసీ వర్గాలు మరియు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి జెసిబిలను అడ్డుకోవడం జరిగింది. ఇండస్ట్రియల్ పార్క్ లో వేసే రోడ్డు డ్రాయింగ్స్ ను మార్చి ఆలయం దెబ్బతినకుండా చూడాలని రైతులందరూ పోలీసులకు మరియు అధికారులకు తెలియజేయడం జరిగింది. అదేవిధంగా తమకు ఇచ్చిన హామీ ప్రకారము మంత్రి శ్రీధర్ బాబు, మరియు శాసనసభాపతి వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్, చొరవ తీసుకొని అమ్మవారి కి ప్రత్యేకంగా ఆలయం నిర్మించే విధంగా ఐదెకరాల స్థలంను కేటాయించే విధంగా, ముందు ముందు ఇండస్ట్రియల్ పార్కులో పనిచేసే కార్మికులకు ఉద్యోగస్తులకు అందరికీ కూడా ఆలయం అందుబాటులో ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామస్తులు గత రెండు సంవత్సరాలుగా చేస్తున్న ఈ పోరాటానికి రాష్ట్రంలోని సాధువులు,గురువులు, మత పెద్దలు హిందూ సంఘాలు,మరియు హిందూ భక్తులందరూ ఈ ఆలయ ప్రాంగణాన్ని సందర్శించి గ్రామస్తులకు అండగా నిలిచి దళిత సామాజిక వర్గము ముందుండి పోరాడుతున్న ఈ ఉద్యమానికి చేయూతనివ్వవలసిందిగా ఎన్కతల గ్రామస్తులందరూ కోరుచున్నారు.....

# పంటపొలాల్లో యుద్ధప్రాతిపదికన నీటి నిల్వలు మళ్లింపు

**శాటిలైట్ చిత్రాలతో గుర్తించి 24 గంటల్లో పూర్తి కార్యాచరణ**

**ఆస్తి నష్టంపై కేంద్రానికి ప్రాథమిక నివేదిక సమర్పించండి**

**తుఫాన్ విధుల్లో ప్రతిభ చూపిన 100 మందికి సన్మానం**

**టెలి కాన్ఫరెన్స్‌లో అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం**



అమరావతి, అక్టోబర్ 31 : మొంథా తుఫాన్‌తో రైతులు నష్టపోకుండా రాష్ట్రంలో నీట మునిగిన పంట పొలాలను యుద్ధప్రాతిపదికన కాపాడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. తుఫాన్ తదనంతర చర్యలపై శుక్రవారం ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. శాటిలైట్ చిత్రాల ఆధారంగా ఎక్కడెక్కడ పొలాలు నీట మునిగాయో గుర్తించి శనివారం కల్లా మొత్తం నీటిని మళ్లించాలని సీఎం స్పష్టం చేశారు. నియోజకవర్గం వారీగా శాటిలైట్ చిత్రాలను విడుదల చేసి... ఎక్కడైతే నీళ్లు నిలిచిపోయాయో అక్కడికి స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు వెళ్లి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. అందరూ కలిసి సమన్వయంతో పని చేయడం ద్వారా క్షేత్ర స్థాయిలో ఫలితాలు రాబట్టాలని సీఎం సూచించారు. శాస్త్రవేత్తల సూచనలు తీసుకుని... పంటలు నీట మునగడం వల్ల దిగుబడి తగ్గకుండా తగు విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కన్నా ఎక్కువగా 60 శాతం మేర బాపట్ల జిల్లాలోని వ్యవసాయ క్షేత్రాల్లో నీరు నిలిచిపోయిందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. బాపట్ల జిల్లాలో మాత్రం ఆదివారం నాటికి నీటి నిల్వలు లేకుండా చేస్తామని విన్నవించారు.

**కేంద్రాన్ని తక్షణ సాయం కోరండి**

మొంథా తుఫాన్‌తో రాష్ట్రానికి జరిగిన నష్టంపై కేంద్రానికి వెనువెంటనే ప్రాథమిక నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలనకు కేంద్ర బృందాన్ని ఆహ్వానించాలన్నారు. తుది నివేదిక సమర్పించేలోగా తక్షణ సాయం అందించేలా కేంద్రాన్ని కోరాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఈ విషయమై తాను ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడతానని ముఖ్యమంత్రి చెప్పారు. అలాగే కృష్ణా నదిలో ప్రస్తుతం కొనసాగుతున్న నీటి నిల్వల వివరాల గురించి ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అయితే కృష్ణాలో వరద ఉధృతి తగ్గిందని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు. అలాగే మొంథా తుఫాన్ రక్షణ చర్యల్లో అత్యుత్తమంగా పనిచేసిన వారిని సన్మానించాలని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు. శనివారం ఉదయం 10 గంటలకు సుమారు 100 మందిని గౌరవించుకునేలా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించాలని చెప్పారు.

# జాప్యం లేకుండా రాజధాని నిర్మాణ పనులు జరగాలి



**నిర్దేశించుకున్న సమయానికి పనులు పూర్తి కావాలి**

**పెండింగులో ఉన్న రిటర్నబుల్ ప్లాట్లను త్వరగా రిజిస్ట్రేషన్ చేయాలి**

**సీఆర్డీఏ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

అమరావతి, అక్టోబర్ 31: రాజధాని నిర్మాణ పనులు జాప్యం లేకుండా జరగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యానికి నిర్మాణాలు పూర్తి కావాలని చెప్పారు. రాజధాని నిర్మాణ పనుల పురోగతి, బ్యూటిఫికేషన్, రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ వంటి అంశాలపై శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఏయే నిర్మాణాలను ఎంత వరకు పూర్తి చేశారు..? వర్క్ ఫోర్స్ ఏ మేరకు ఉంది..? నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్, మెషినరీని ఆయా సంస్థలు ఏ మేరకు సమకూర్చుకున్నాయనేదానిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏయే భవనాలను ఎప్పటిలోగా పూర్తి చేయాలో నిర్దిష్ట సమయాన్ని నిర్దేశించుకున్నామని... ఆ మేరకు పనులను పూర్తి చేయాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. నిర్మాణాల్లో వేగంతో పాటు.. నాణ్యత ప్రమాణాలను పక్కాగా పాటించాలని ఆదేశించారు. పనుల పురోగతిపై ప్రతి 15 రోజులకోసారి సమీక్షిస్తానని చెప్పారు. ప్రస్తుతం వర్షాల కారణంగా నిర్మాణ పనుల్లో కొంత మేర జాప్యం జరిగినా.. రానున్న రోజుల్లో దాన్ని భర్తీ చేసేలా నిర్మాణాల్లో వేగం పెంచాలని చంద్రబాబు సూచించారు. ఇంకా కొన్ని నిర్మాణ సంస్థలు వర్క్ ఫోర్స్, మెషీనరీని పూర్తి స్థాయిలో కేటాయించలేదని... ఇలా ఉన్న సంస్థలు తమ పనితీరు మెరుగుపరుచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇక రాజధాని భవనాల నిర్మాణాలకు అవసరమైన గ్రావెల్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని అన్నారు. ఈ మేరకు గనుల శాఖతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి చెప్పారు.

**రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లలో రైతులకు ఇబ్బందులు రానివ్వొద్దు**

రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఎంతవరకు పూర్తైందని సీఎం ఆరా తీశారు. రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ల విషయంలో రైతులకు ఏ మాత్రం ఇబ్బందులు రానివ్వొద్దని మంత్రి నారాయణ, అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సందర్భంగా రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన వివరాలు అధికారులు అందించారు. ఇంకా 2,471 మంది రైతులకు రిటర్నబుల్ ప్లాట్లను రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉందని.. ఇవి కూడా చిన్నపాటి సాంకేతిక, రైతుల వ్యక్తిగత అంశాల కారణంగా పెండింగులో ఉన్నాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. తాను కూడా త్వరలోనే రాజధాని రైతులతో సమావేశమవుతానని ముఖ్యమంత్రి తెలిపారు. రాజధానిలో నిర్మాణాలకు ఎంతటి ప్రాధాన్యమిస్తున్నామో..గ్రీనరీ, సుందరీకరణ, పరిశుభ్రతకు కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. రాజధానుల గార్డెనింగ్, బ్యూటిఫికేషన్ వంటి వాటిల్లో ఎలాంటి రాజీపడొద్దని సూచించారు. ఇక ప్రైవేట్ సంస్థలు చేపట్టే నిర్మాణాలు కూడా ఐకానిక్ మోడల్లో ఉండేలా చూడాలని ఆయా సంస్థల ప్రతినిధులను కోరాలని అధికారులకు సూచించారు. అమరావతికి వరల్డ్ క్లాస్ సిటీ లుక్ రావాలంటే హైరెయిజ్ బిల్డింగులు ఉండాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీఎల్, ఫైనాన్స్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, వివిధ కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కుంచనపల్లిలో శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణ శంకుస్థాపన మహోత్సవం

**ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి నారా లోకేష్**





తాడేపల్లి: మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి మండలం కుంచనపల్లిలోని శ్రీ గంగా, శ్రీ అన్నపూర్ణాదేవి సమేత శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామివార్ల ఆలయ పునఃనిర్మాణ శంకుస్థాపన మహోత్సవంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్ కు.. గ్రామస్థులు, ఆలయ పునఃనిర్మాణ అభివృద్ధి కమిటీ సభ్యులు బాణసంచా కాల్చి ఘనస్వాగతం పలికారు. వేదమంత్రోచ్ఛారణల మధ్య ఆలయ పునఃనిర్మాణ అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి శ్రీ గంగా, శ్రీ అన్నపూర్ణాదేవి సమేత శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి వార్ల ఆలయ పునర్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ధాన్యాదివాసంలోని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిలఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అందరితో కలిసి ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావుతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



ఉక్కుమనిషి, భారత తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి ఘన నివాళులు అర్పిస్తున్నాను. దేశ ఐక్యతకు కృషిచేసిన వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్. దేశ తొలి హెూంమంత్రిగా, ఉప ప్రధానిగా విశేష సేవలు అందించారు. ధృడమైన సంకల్పం, అచంచల నాయకత్వం ఆయన సొంతం. జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ అందించిన సేవలను స్మరించుకుందాం.

...నారా లోకేష్,విద్య, ఐటి శాఖల మంత్రి.






ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయానికి వెళ్లారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ నేతలతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం దివ్యాంగులు, ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కారానికి హామీ ఇచ్చారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన న్యూట్రిఫుల్ సెంటర్‌ను సీఎం చంద్రబాబు సందర్శించారు. రోజుకు ఎంతమంది న్యూట్రిఫుల్ యాప్‌లో రిజిస్టర్ అవుతున్నారని ఆరా తీశారు. యాప్‌లో రిజిస్టర్ ప్రాసెస్‌ను ఏ విధంగా మోనిటర్ చేస్తున్నారని, రిజిస్టర్ అయిన వారిని ఎలా గైడ్ చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు.

# నవంబర్ 7న జరిగే పెన్షనర్ల చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

## TSGREA. రిటైర్డ్ ఉద్యోగులకు పిలుపు







**ఖమ్మం ప్రతినిధి అక్టోబర్ 31 (ప్రజాబలం)** ఖమ్మం రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 7న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్ బాబు పెన్షనర్లకు పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా కార్యాలయంలో అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత 19 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులను హార్దిక ఇబ్బందులకు గురి చేస్తున్నదని దీనివలన కొందరు పెన్షనర్లు ఆందోళనతో తనువులు చాలిస్తున్నారని అయినా ప్రభుత్వములో చలనం లేకపోవడంతో ఈ నెల ఏడున హైదరాబాదులోని ఇందిరా పార్కు వద్ద పెన్షనర్ల నిరసన ధర్నాను పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఆందోళన కార్యక్రమంలో రాష్ట్రంలోని 33 జిల్లాల రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా ప్రతి నెల 700 కోట్లు విడుదల చేయాలని రిటైర్డ్ ఉద్యోగులకు అందరికీ ఆరోగ్య కార్డులను అన్ని ఆసుపత్రులలో అమలు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని పే రివిజన్ కమిటీ రిపోర్టును వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈనెల 7న హైదరాబాదులో పెద్ద ఎత్తున జరిగే పెన్షనర్ల ఆందోళన కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులకు ఏమైనా ఇబ్బందులు జరిగితే దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుబ్బయ్య మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని రిటైర్డ్ ఉద్యోగులంతా ఈ ఆందోళన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ లోని ఐదు డిఏలను మరియు బకాయిలను వెంటనే విడుదల చేయుటకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి తాళ్లూరి వేణు ఉపాధ్యక్షులు ఉపేందర్ రావ్ జనార్ధన్ దుర్గాదేవి పూర్ణచంద్రరావు సాంబశివరావు రఘుపతి రెడ్డి రాజారావు సెల్లి బాబురావు కృష్ణమూర్తి సత్యనారాయణ తదితరులు హాజరైనారు

## ట్రాక్టర్ల సంఘం ఎన్నికల్లో దుందుభి మోగించిన సరిపల్లి కార్తీక్

## 71 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపు

## ఆదరించిన సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపిన కార్తీక్



**వేములవాడ అక్టోబర్ 31 ( ప్రజాబలం దినపత్రిక)**వేములవాడ పట్టణంలోని ట్రాక్టర్ల సంఘం అధ్యక్షుని ఎన్నికలు శుక్రవారం రోజున హోరా హోరిగా జరిగాయి మొత్తం ఓట్ల సంఖ్య 218 ఉండగా పోలైన ఓట్లు 203 కాగా 66 ఓట్లు అనుముల బాలయ్య కి రాగా సరిపెల్లి కార్తీక్ కి 137 ఓట్లు సాధించి 71 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందాడు. ఈ సందర్భంగా సరిపెల్లి కార్తీక్ మాట్లాడుతూ వేములవాడ పట్టణ ట్రాక్టర్ అసోసియేషన్ ఎన్నికల్లో నన్ను అత్యధిక మెజారిటీతో గెలుపొందించినందుకు ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ రాబోయే రోజుల్లో ట్రాక్టర్ యూనియన్ ని మరింత బలోపేతం చేసి, యూనియన్ సమస్యలపై పోరాడుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాక్టర్ అసోసియేషన్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తుఫాను బీభత్సం వల్ల దెబ్బతిన్న పంటలను రోడ్లును పరిశీలించిన ప్రణవ్



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 31** హుజురాబాద్ మండల పరిధిలో జూపాక గ్రామంలో ఇటీవల మొంథా తుఫాను వల్ల దెబ్బతిన్న రోడ్లను,పంట పొలాలను హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు.పరిస్థితిని అంచనా వేస్తున్నామని,ఇప్పటికే ప్రభుత్వానికి ప్రాథమిక అంచనా నివేదికను అందజేశామని రైతులెవరూ అధైర్యపడవద్దని రైతు ప్రభుత్వంగా అన్నదాతలను ఆదుకుంటామని తెలిపారు. శుక్రవారం రోజున హుజూరాబాద్ మండల పరిధిలోని జూపాక హుజూరాబాద్ రోడ్ ను ఆయన పరిశీలించారు.దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చెపిస్తామని ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వివరాలను అందజేసి ఆదుకుంటామని తెలిపారు.కాగా పలువురు రైతులతో ఆయన మాట్లాడారు.కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సకాలంలో తీసుకునేలా ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని,ప్రభుత్వం రైతు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని అన్నారు.

## రహ్మత్ నగర్ లో సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఎన్నికల ప్రచారం

హైదరాబాద్ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జుబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో భాగంగా రహ్మత్ నగర్ అమర్ టీ పాయింట్ లో మాట ముచ్చట కార్యక్రమములో పాల్గొనడం జరిగింది.

ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ జుబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో రోజురోజుకు దిగజారుతున్న కాంగ్రెస్ పార్టీ దుస్థితిని కాపాడుకోవటానికి మైనారిటీలను మభ్యపెట్టడానికి మాజీ క్రికెటర్ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇస్తున్నారని ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ క్యాబినెట్ విస్తరించడం కాంగ్రెస్ పార్టీ అనైతికతకు నిదర్శనం అని అన్నారు.పాలనలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని పరిశుభ్రత పడకేసింది,బస్తీ దవాఖానలకు సుస్తీ చేసింది,మంచినీటి కొరత ఏర్పడిందని,కరెంట్ కోతలకు దిక్కులేదని ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని దుయ్యబట్టారు. హైడ్రా పేరుతో పేదవాళ్ల ఇండ్లను కూల్చి వాళ్ల ఉసురుపోసుకుంటుందని అన్నారు.మాట ముచ్చట కార్యక్రమములో భాగంగా చాయ్ హోటల్ యాజమాని వాజిద్ తో మాట్లాడడం జరిగింది. వాజిద్ తన ఆవేదన వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వ్యాపారాలు కులిపోయాయి అని సామాన్యుని జీవితం దుర్భరంగా మారిందని మాగంటి.గోపీనాథ్ అందుబాటులో ఉండి అభివృద్ధి చేశారని ఖచ్చితంగా మాగంటి.సునీత గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు . వనపర్తి నియోజకవర్గ నాయకులు మాగంటి.సునీత గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమములో మాజీ ఎం.ఎల్.ఏ మర్రి.జనార్దన్ రెడ్డి,గిద్దంగుల సంస్థ మాజీ ఛైర్మెన్ రజినీ సాయిచంద్ నాయకులు పాల్గొన్నారు.

# చంద్రశేఖర్ కుటుంబానికి వాటర్ ప్లాంట్ యూనియన్ అండ



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 31**ఇటీవల మరణించిన సాహితీ వాటర్ ప్లాంట్ చంద్రశేఖర్ కుటుంబానికి జమ్మికుంట టౌన్ వాటర్ ప్లాంట్ యూనియన్ సభ్యులు అండగా నిలిచారు.

యూనియన్ సభ్యులు చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా, మానవతా దృక్పథంతో యూనియన్ తరఫున ? 11,500/- (పదకొండు వేల ఐదు వందల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని వారికి అందజేశారు.ఈ పరామర్శ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు నరేష్, సంతోష్, శ్రీను, ప్రసాద్, చందు, సంపత్, సంతోష్, రాజు, రాజేంద్రప్రసాద్, రాజేశ్వర్,శ్రీకాంత్,శ్రీనాథ్,ఐలయ్య తదితరులు పాల్గొన్నారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలవడంలో యూనియన్ సభ్యులు తమ ఐకమత్యాన్ని చాటుకున్నారు.

## సమాచార శాఖ ఆధ్వర్యంలో ఘనంగా షేక్ రహ్మత్ అలీ పదవీ విరమణ వేడుక

## సేవా నిబద్ధతకు గుర్తింపుగా షేక్ రహ్మత్ అలీకి సన్మానం



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ప్రజాబలం అక్టోబర్ 31:**సమాచార పౌర సంబంధాల శాఖ వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన షేక్ రహ్మత్ అలీ రికార్డు అసిస్టెంట్ పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు షేక్ రహ్మత్ అలీ రికార్డ్ అసిస్టెంట్ పదవి విరమణ కార్యక్రమంలో డి పి ఆర్ ఓ స్వర్ణలత, డిప్యూటీ ఇ ఐ ఇ నాగాంజలి హాజరయ్యారు.

ఈ సందర్భంగా సమాచార శాఖ వారు షేక్ రహమత్ అలీ సేవలను గుర్తు చేస్తూ వారి నిబద్ధత, నిస్వార్థత, విధుల పట్ల వారు నిర్వహించిన బాధ్యతలు ళ్లాఘనీయం అన్నారు. అలాగే, వారి శేష జీవితం ఆరోగ్యంగా ప్రశాంతంగా సాగిపోవాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. షేక్ రహమత్ అలీ గారు స్పందిస్తూ ఐ &పిఆర్ డిపార్ట్మెంట్ లో అనేక జిల్లాలలో సేవలు చేసే అవకాశం అనేది అదృష్టంగా భావిస్తున్నానని, ఇందుకు గర్వంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో, షేక్ రహమత్ అలీని పలువురు ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా దేవత సుధాకర్ గజల్ ఆలాపన ఆకర్షించింది. ఇందులో డిపిఆర్ఓ సిబ్బంది, ఇంజనీరింగ్ విభాగం ఉద్యోగులు, పాత్రికేయులు, షేక్ రహమత్ అలీ కుటుంబ సభ్యులు మరియు మిత్రులు పాల్గొన్నారు.

# జాతీయ సమైక్యతలో భాగస్వామ్యం కావాలి

## అట్టహాసంగా రన్ ఫర్ యూనిటీ

## మందమర్రి సీఐ కె. శశిధర్ రెడ్డి



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ అక్టోబర్ 31:** కుల, మత, వర్గ, లింగ భేదాలు లేకుండా ప్రజలందరూ ఐకమత్యంతో మెలుగుతూ, జాతీయ సమైక్యతలో భాగస్వామ్యం కావాలని మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి పిలుపునిచ్చారు. భారత తొలి ఉప ప్రధాని, హోం మంత్రి, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా శుక్రవారం మందమర్రి పట్టణంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో "రన్ ఫర్ యూనిటీ" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఐ శశిధర్ రెడ్డి, తహసీల్దార్ సతీష్, జీఎం ఎన్ రాధాకృష్ణ లు హాజరయ్యారు. పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానం నుండి 2కే రన్ ను తహసీల్దార్ సతీష్ జెండా ఊపి ప్రారంభించగా పాత బస్టాండ్ వరకు కొనసాగింది. 2 కె రన్ లో పట్టణ పోలీసులు, విద్యార్థులు, యువతతో పాటు పలు రాజకీయ, సామాజిక సంఘాల నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ శశిధర్ రెడ్డి, జీఎం ఎన్. రాధాకృష్ణ, తహసీల్దార్ పనకంటి సతీష్ కుమార్ లు మాట్లాడుతూ ౼"ఐక్యతా స్ఫూర్తితో సమాజంలో శాంతి, సహకారం నెలకొల్పేలా ప్రజలు కృషి చేయాలి. ప్రతి ఒక్కరూ జాతీయ సమైక్యతలో భాగస్వామ్యం కావాలి" అని వారు పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్, సింగరేణి అధికారులు, పట్టణ యువత, వాకర్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు, పట్టణ వాసులు పాల్గొన్నారు.



## నిజాయితీ నిరూపించుకున్న రాజన్న ఆలయ ఔట్సోర్సింగ్ ఉద్యోగి.

## మహిళా హ్యాండ్ బ్యాగ్ అప్పగించిన ఏరెడ్డి బాల్ రెడ్డి.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** శుక్రవారం రోజున వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో లడ్డు కేంద్రంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగి ఏ రెడ్డి బాల్ రెడ్డి నిజాయితీ నిరూపించుకున్నాడు. వివరాల్లోకి వెళితే కందికట్కూరు గ్రామానికి చెందిన రాజన్న భక్తురాలు శుక్రవారం రోజున రాజన్న ఆలయంలో దర్శనార్థం వచ్చింది. దర్శనం అనంతరం లడ్డు ప్రసాదం కొనుగోలు చేసిన అనంతరం హ్యాండ్ బ్యాగ్ అక్కడే మర్చిపోయింది. గమనించిన కాంట్రాక్టు ఉద్యోగి ఏ రెడ్డి బాల్ రెడ్డి హ్యాండ్ బ్యాగ్ ను భక్తురాలికి అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు. దీంతో హ్యాండ్ బ్యాగ్ అప్పగించిన ఉద్యోగికి భక్తురాలు ధన్యవాదాలు తెలిపింది.

## జాతీయ సమైక్యతకు నిదర్శనం సర్దార్ వల్లభభాయ్ పటేల్

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్








**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గ రిపోర్టర్ అక్టోబర్ 31 :** దేశ ప్రజలందరినీ ఏకతాటి పైకి తీసుకువచ్చి జాతీయ సమైక్యతకు నిదర్శనంగా నిలిచిన మహనీయుడు సర్దార్ వల్లభభాయ్ పటేల్ అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి ఐ.బి. చౌరస్తా వరకు నిర్వహించిన రన్ ఫర్ యూనిటీ 2కె రన్ కార్యక్రమాన్ని డి.సి.పి. ఎ.భాస్కర్,మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్,జిల్లా క్రీడా యువజన సర్వీసుల అధికారి హనుమంతరావు లతో కలిసి ప్రారంభించి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... దేశ ప్రజలందరినీ ఐక్యం చేస్తూ జాతీయ సమైక్యతకు కృషి చేసిన మహనీయుడు సర్దార్ వల్లభభాయ్ పటేల్ అని అన్నారు. కుల,మత,వర్గ,వర్ణ, ప్రాంతీయ,సాంస్కృతిక విభేదాలు లేకుండా ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చారని, భారతదేశ మొదటి ఉప ప్రధానమంత్రిగా దేశానికి విశిష్ట సేవలు అందించారని తెలిపారు. దాదాపు 530 రాష్ట్రాలను భారతదేశంలో విలీనం చేశారని,పౌర హక్కులు,రైతు ప్రయోజనాల కోసం కృషి చేశారని తెలిపారు.ప్రజలందరూ ఐక్యతతో ముందుకు సాగితే రాష్ట్రం,దేశ అభివృద్ధి సాధ్యపడుతుందని, దేశభక్తి,సమైక్యత భావం ప్రతి ఒక్కరిలో ఉండాలని తెలిపారు. ప్రజల సంక్షేమం,దేశ అభివృద్ధికి కృషిచేసిన మహనీయుల ఆశయాలను యువత సమిష్టిగా ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సకల సదుపాయాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్







**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31 :** ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శుక్రవారం జిల్లాలోని కాసిపేట మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సింగ్, మండల పంచాయతీ అధికారి సప్దర్ అలీ లతో కలిసి ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు,వంటశాల, రిజిస్టర్లు,మధ్యాహ్న భోజనం నాణ్యత, ఇంటర్మీడియట్ అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలో పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు.విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మధ్యాహ్నం భోజనంలో పౌష్టిక ఆహారాన్ని అందిస్తుందని,ఈ క్రమంలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు.నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్యా బోధన అందిస్తుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని,తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.తెలంగాణ ఆదర్శ పాఠశాల - కళాశాల,ప్రభుత్వ జూనియర్ కళాశాల లను సందర్శించి ల్యాబ్,వంటశాల, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించి అధికారులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించి విద్యా బోధన చేయాలని తెలిపారు. మండలంలోని రేగులగుంట,మల్కాపెల్లి గ్రామాలలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలను సందర్శించి వంటశాలలు,తరగతి గదులు,పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించి విద్యా బోధన అందించాలని, పాఠశాలలలో అవసరమైన మూత్రశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మర్పల్లి టు మోమిన్ పేట్ మరమ్మత్తు నోచుకోని

# ఆర్ఎంబి రోడ్డు





**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్31( ప్రజాబలం ) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి టు మోమిన్ పేట్ వెళ్లే రహదారి దీనాది దీనంగా అద్వాన స్థితిలో ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు రోడ్డు విషయంలో అధికారులు నాయకులు స్పందించి వెంటనే మరమ్మత్తులు చేసేందుకు కృషి చేయాలని ప్రయాణికులు ఆవేదన వ్యక్తపరిచారు రాత్రివేళ టు వీలర్ కానీ ఫోర్ వీలర్ గానీ నడపాలంటే భయంకరంగా ఉందని ఆవేదన వ్యక్తపరిచారు వర్షాల కారణంగా గుంతలు ఎక్కువగా పడి నీరు నిలచి ప్రయాణికులకు అసౌకర్యవంతంగా ఉన్నట్టు తెలిపారు ఇప్పటికైనా వెంటనే ప్రభుత్వాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం పనులు పూర్తిచేయాలని ప్రజలు ఆవేదన వ్యక్తపరిచారు

# వేములవాడ రూరల్ పోలీసులచే రన్ ఫర్ యూనిటీ

# కార్యక్రమం నిర్వహణ.

### సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి సందర్భంగా నిర్వహణ.

### విద్యార్థులు, యువకులు, ప్రజలు, క్రీడాకారులు, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.




**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా వేములవాడ రూరల్ మండల పరిధిలో మర్రిపల్లి గ్రామ కస్తూరిబా కస్తూరిబా విద్యాలయం నుండి మర్రిపల్లి గ్రామ బస్టాండ్ వరకు రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం లో భాగంగా 2 కె రన్ నిర్వహించడం జరిగిందని వేములవాడ రూరల్ ఎస్సై వెంకట్రాజం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకట్రాజం మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినం సందర్భంగా జాతీయ ఐక్యత దినోత్సవం లో భాగంగా ప్రజలకు సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు తెలియజేయాలని, దేశ ఐక్యత, సమగ్రతకు సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయమని, ఆయన ఆలోచనలు, స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని తెలిపారు. రన్ ఫర్ యూనిటీ వంటి కార్యక్రమాల ద్వారా జాతీయ ఐక్యత పట్ల ప్రజల్లో చైతన్యం పెంపొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ రూరల్ ఎస్సై వెంకట్రాజం, రూరల్ మండల విద్యాధికారి కిషన్, ఏఎస్ఐ రవీందర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు, కానిస్టేబుల్లు రాజశేఖర్, సతీష్, రమేష్, ఆరిఫ్, దేవరాజు, వినయ్ కుమార్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత, క్రీడాకారులు మరియు గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# ఏబీవీపీ ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలో

# ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దగ్ధం.




**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** శుక్రవారం రోజున వేములవాడ పట్టణంలో విద్యార్థుల సమస్యలపై ఆందోళనలుతీవ్ర రూపం దాల్చినాయి. ఏబీవీపీ విద్యార్థి నాయకుల ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం మరియు సీఎం రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ భారీ ఎత్తున నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్యాంప్ ఆఫీసును ముట్టడిస్తామని ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు హెచ్చరించారు.8,500 కోట్ల రూపాయలు పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తక్షణమే స్పందించాలని, లేకపోతే గల్లి గల్లి లో అడ్డుకుంటామని ఆఫీసులను, ఇండ్లను ముట్టడిస్తామని ఏబీవీపీ నాయకులు హెచ్చరించారు. విద్యార్థుల నిధుల విడుదలలో జాప్యం పట్ల విద్యార్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినారు. ప్రభుత్వం నిధులు వెంటనే విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.





## నిరుపేద దహన సంస్కారాలకు 5 వేల తక్షణ ఆర్థిక సాయం అందజేత.

## మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్.

**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** వేములవాడ పట్టణంలోని అంబేద్కర్ నగర్ కు చెందిన నిజామాబాద్ దేవయ్య అనారోగ్యంతో గురువారం రాత్రి తుది శ్వాస విడిచాడు. దహన సంస్కారాలకు కూడా డబ్బులు లేని నిరుపేద కుటుంబమని మీ వంతు ఏదైనా తోచిన సహాయం అందించండి అని ఇతని కుమారుడు శ్రీనివాస్ మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ వారిని అభ్యర్థించడంతో ట్రస్ట్ మరియు ఇతర వాట్సాప్ గ్రూపులలో పోస్ట్ చేయడంతో దాతలు వెంటనే స్పందించి తక్షణసాయంగా 5000 రూపాయలు నిజామాబాద్ శ్రీనివాస్ కు అందజేయడం జరిగిందని, ఇంకా ఎవరైనా దాతలు స్పందించి తమకు తోచిన విధంగా విరాళాలు అందిస్తే వాటిని కూడా బాధిత కుటుంబానికి అందించడం జరుగుతుందని, మానవతా దృక్పథంతో విరాళాలు అందించే దాతలు ట్రస్ట్ ఫోన్ పే/గూగుల్ పే నెంబర్: 8985588060, కు గాని 9246939388 నెంబర్ కు అందించాలని ట్రస్ట్ నిర్వాహకులు మధు మహేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు విద్యార్థులు వోడ్యాల వేణు పాల్గొన్నారు.

# ఏపీ ఎస్ బి సి ఎల్, ఐ ఎం ఎఫ్ ఎల్ డిపోను తనిఖీ చేసిన జెసి

నంద్యాల, జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ శుక్రవారం నంద్యాల పట్టణంలోని ఏపీ ఎస్ బి సి ఎల్ మరియు ఐ ఎం ఎఫ్ ఎల్ డిపోను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్... డిపోలో ఉన్న ఐ ఎం ఎఫ్ ఎల్ మరియు బీర్ స్టాక్ యొక్క ప్లాట్లను క్షుణ్ణంగా పరిశీలించి స్టాక్ యొక్క ఓపెనింగ్ బ్యాలెన్స్ చెక్ చేయడం జరిగింది. డిపో లో ఉన్న రికార్డులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే డిపో సేల్స్, ఏపీ సురక్ష యాప్, గురించి డిపో మేనేజర్ నాగేష్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిపో పరిసరాలను కలియతిరిగి ఐ ఎం ఎల్ మరియు బీర్ లోడింగ్ అన్ లోడింగ్ కేసులకు సంబంధించి అక్కడి సిబ్బందికి పలు అంశాలు తెలియజేసి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపర్వైజర్ కోటిరెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది, డిపో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధర్మ దీక్షలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్ లోని ఉస్మానియా క్యాంపస్ లో ఓయు బీసీ జే ఎస్సి ఆధ్వర్యంలో బీసీ కులాలకు చట్ట సభల్లో రిజర్వేషన్ల సాధనకై ధర్మ దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు..

ఈ కార్యక్రమంలో మంత్రివర్యులు వాకిటి శ్రీహరి ,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య , బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ,ఓయూ జే ఎస్సి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31 :** జిల్లాలో నవంబర్ 1వ తేదీ నుండి పత్తి కొనుగోలు చేపట్టనున్న పత్తి కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శుక్రవారం జిల్లాలోని తాండూర్ మండలంలోని మహేశ్వరి కాటన్స్, శ్రీరామా జిన్నింగ్- ప్రెస్సింగ్ యూనిట్ లను మండల తహసిల్దార్ జ్యోత్స్న తో కలిసి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం సి సి ఐ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు.2025- 26 సంవత్సరంలో మద్దతు ధర క్రింద సి.సి.ఐ. కు పత్తి విక్రయించేందుకు ప్రభుత్వం ప్రారంభించిన కపాస్ కిసాన్ యాప్ లో రైతులు తమ వివరాలు నమోదు చేసుకుని,పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం పత్తిలో తేమ శాతం, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుని రైతుల వద్ద నుండి పత్తి కొనుగోలు చేయాలని సూచించారు.ఆధార్ నంబర్ కు అనుసంధానం చేయబడిన బ్యాంకు ఖాతాలో మాత్రమే చెల్లింపులు జరుగుతాయని,ఆధార్ కార్డులో ఫోటో కలిగి ఉన్న రైతు మాత్రమే తక్పట్టిలో ఫోటో దిగవలసి ఉంటుందని తెలిపారు.దళారులు కొనుగోలు చేసిన పత్తిని కొనుగోలు కేంద్రాలలోనికి అనుమతించకూడదని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్మెంట్ వెంటనే విడుదల చేయాలి

## జోగిపేటలో విద్యాసంస్థల బందు

## ఎస్ఎఫ్ఐ అందోల్ డివిజన్ అధ్యక్షుడు గొల్ల శంకర్



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 31 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ, పిలుపులో భాగంగా, పెండింగులో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్, విడుదల చేయాలని, జోగిపేటలో, విద్యాసంస్థల బంధు నిర్వహించారు, ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆందోల్ డివిజన్ అధ్యక్షుడు, గొల్ల శంకర్, మాట్లాడుతూ, పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్మెంట్, వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ఆరు సంవత్సరాల నుండి తెలంగాణ రాష్ట్రంలో,8150, కోట్ల దాకా, స్కాలర్షిప్స్, ఫీజు రియంబర్మెంట్, పెండింగ్లో ఉందని అన్నారు, ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలో, చదివి విద్యార్థులకు స్కాలర్షిప్ తీసుకుందామంటే, ప్రభుత్వం నుండి డబ్బులు రాలేదని, విద్యాసంస్థల యాజమాన్యులు, స్కాలర్షిప్ ఇవ్వడం లేదన్నారు, గత నెల రోజుల క్రితం తెలంగాణ రాష్ట్రంలో, ఉన్నటువంటి ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు, పిజీ కళాశాలలో ఇంజనీరింగ్ కళాశాలలో, రాష్ట్రంలో బందుకు పిలుపునిస్తే, రాష్ట్ర ప్రభుత్వం వారితో చర్చలు జరిపి,1200, కోట్ల రూపాయలను, రెండు దపాలుగా విడుదల చేస్తామని, చెప్పి ఒక్క రూపాయి కూడా విడుదల చేయకుండా, ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం, పేద విద్యార్థుల జీవితాలతో, చెలగాటం ఆడుతుంది అన్నారు, రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న, విద్యారంగ సమస్యలపై, అలాగే పెండింగ్లో ఉన్న, స్కాలర్షిప్, మరియు ఫీజు రియంబర్మెంట్, తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, రమేష్, కృష్ణ, అనిల్,రాజు, నవీన్,సాయి, తదితరులు పాల్గొన్నారు

# చదువుతో సమాజంలో మంచి గుర్తింపు:

## కోట్ల సుజాతమ్మ

బేతంచర్ల, చదువుతో సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ తెలియజేశారు. శుక్రవారం నాడు బేతంచర్ల పట్టణంలోని బనగానపల్లె రహదారిలో ఉన్న కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఉన్న విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో మంచి భవిష్యత్తు ఉంటుందని బాగా చదివి అటు తల్లిదండ్రులకు ఇటు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అభేదా, ఉపాధ్యాయులు, టి.డి.పి నాయకులు పాల్గొన్నారు.

# ఎండోమెంట్ కమీషనర్ ను కలిసిన బద్దం సతీష్‌గౌడ్



**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** శుక్రవారంనాడు ఎండోమెంట్ కమీషనర్ డాక్టర్ హరీష్ ఐ ఏ స్ ని కలిసి గోషామహల్ నియోజకవర్గం లోని ఎండోమెంట్ పరిధిలో వున్న మఠం ల వ్యవహారాలపై, దేవాలయ లఆస్తులు, భూముల అన్యాక్రాంతం పైన పూర్తి విచారణ చెప్పట్టాలని మరియు డోనార్స్ పథకం పైన విచారణ చెప్పట్టాలని, మరియు డోనార్స్ పథకం ద్వారా దేవాలయలను అభివృద్ధి పరిచి వారే నిర్వహణ చేపడుతు ఎండోమెంట్ ఈ ఓ లను వారు దరిదపులోకి కూడా రానివ్వరు అనే విషయాన్ని గోషామహల్ నియోజకవర్గం డెవలప్మెంట్ ఫోరమ్ కన్వీనర్ బద్దం సతీష్ గౌడ్ కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది అని తెలుపుతూ తక్షణమే కమీషనర్ తప్పకుండా విచారణ చేపడుతాను అని తెలిపారని బద్దం సతీష్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు చేతన్, ఫోరమ్ సభ్యులు పాల్గొన్నారు






**నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:** నాంపల్లి గాంధీభవన్ లో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఫోటోకు పూలమాల వేసి నివాళు లర్పించిన ఏఐసీసీ ఓబీసీ కోఆర్డినేటర్ నిర్మల్‌కూమార్ యాదవ్ ,క్రిష్ణ కూమార్ . ముత్యాలు ,వినోద్‌సింగ్ , సురేష్‌గౌడ్ తదితరులు

# నష్టపోయిన వారి రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలి

## ఉమ్మడి మెదక్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధ్యక్షుడు జైపాల్ నాయక్



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 31 (ప్రజాబలం ) సంగారెడ్డి జిల్లా:** తుఫాన్ ప్రభావం వల్ల, రాష్ట్రవ్యాప్తంగా, కురుస్తున్న భారీ వర్షాలతో, అన్నదాత పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది, అప్పులు చేసి ఆరుగాలం శ్రమించి, పండించిన వరి పంట, అమ్ముకునేందుకు రైతులకు తిప్పలు తప్పడం లేదు, రైతులు కల్లాలలో, రోడ్ల పక్కన ఆరబోసిన వరి ధాన్యం తడిసి ముద్దయింది, అని జయపాల్ నాయక్ అన్నారు, గురువారం నాడు చౌటాకూర్, బొమ్మ రెడ్డి గూడెంలో, రోడ్లపై ఆరబెట్టిన తడిసిపోయిన వరి ధాన్యాన్ని, ఆయన పరిశీలించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తడిసిన వరి ధాన్యం మొలకెత్తింది, ప్రభుత్వం తక్షణమే తడిసిన వరి ధాన్యాన్ని, కొనుగోలు చేసి, నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారం అందించాలని, గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు, జయపాల్ నాయక్, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సుదర్శన్, సంతోష్, దేవన్న,సుభాష్ నాయక్, రాజు,అకేష్, సుభాష్,లు పాల్గొన్నారు....

# పొయిన ఫోన్లను సిఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ట్రేస్ చేసి అందించిన ఎస్సై



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గ రిపోర్టర్ అక్టోబర్ 31 :** మంచిర్యాల జిల్లాలోని లక్సెటిపేట పోలీస్ స్టేషన్ పరిదిలో లక్షెట్టిపేట కి చెందిన లక్ష్మి,అజయ్ మొబైల్ లక్షెట్టిపేట బజార్ ఏరియాలో మిస్ అయ్యింది అనే పిర్యాదు తో పోలీస్ స్టేషన్ లోసంప్రదించగా, ఎస్సై గోపతి సురేష్ ఆదేశాలమేరకు పోలీస్ సిబ్బంది,సిఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ట్రేస్ చేసి,శుక్రవారం రోజున లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్ లో మొబైల్ ఫోన్లను ఎస్సై గోపతి సురేష్ అందించడం జరిగింది.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com